PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 128 | విజయవాడ, శనివారం 9 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 9 December 2023 | Rs

బిల్లులు పెండింగే ప్రధాన సమస్య

- గవర్నర్ అధికారాలు, రాష్ట్రాలతో ఘర్షణపై రాజ్యసభలో చర్చ

7

నీట మునిగిన పంట

- మనస్తాపంతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - దుగ్గిరాల (గుంటూరు జిల్లా)



నీట మునిగిన వరి పొలాన్ని చూసి తీవ్ర మనస్తాపంతో యువ కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం యాదవపాలేనికి చెందిన తుళ్లిమిల్లి బసవపున్నయ్య (36) తనకున్న ఎకరంన్నర పొలంతోపాటు మరో నాలుగున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. ఇందుకోసం రూ.లక్షన్నర వరకూ అప్పులు చేశారు. భారీ వర్షాలకు పొలం మొత్తం నీట మునిగింది. ఇది తట్టుకోలేక బసవపున్నయ్య బుధవారం సాయంత్రం తాను సాగు చేస్తున్న పొలం సమీపంలో పురుగు మందు తాగారు. పొన్నూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

81 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్

- మార్చి 17న స్క్రీనింగ్ టెస్ట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపిపిఎస్‌సి) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ శుక్రవారం జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌లో మొత్తం 81 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు జనవరి 1 నుంచి 21వ తేదీలోగా www.psc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మార్చి 17వ తేదిన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. జివో 5 ఆధారంగా ప్రాధమిక పరీక్ష (స్క్రీనింగ్ టెస్ట్) నుంచి ప్రధాన పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రధాన పరీక్ష నిర్వహణ తేదీలను తరువాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. శాఖల వారీ పోస్టుల వివరాలు, ఇతర వివరాలను కమిషన్ వెబ్‌సైట్ www.psc.ap.gov.in లో అభ్యర్థులు పొందవచ్చు. స్క్రీనింగ్, మెయిన్స్ పరీక్షల సిలబస్‌ను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణ రెండు పేపర్లలో ఉంటుంది. 120 మార్కులకు పేపర్ -1, 120 మార్కులకు పేపర్-2 ప్రశ్నాపత్రాలు ఉంటాయి. ప్రతి తప్పుడు సమాధానానికి 1/3వ వంతు నెగిటివ్ మార్కు ఉంటుంది. మెయిన్ పరీక్ష తెలుగు, ఇంగ్లీష్ పేపర్లతో పాటు మరో ఐదు పేపర్లలో ఉంటుంది. ప్రతి పేపర్ 150 మార్కులకు ఉంటుంది. దీంతో పాటు 75 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది.



సిపిఎం ప్రజాప్రణాళిక సమాలోచనలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

కమ్యూనిస్టులు బలపడాలి

- సిపిఎం ప్రజాప్రణాళిక సమాలోచనలో మేధావులు, విద్యావేత్తల అభిప్రాయం
- అసమానతలు లేని అభివృద్ధి కోసం కృషి : శ్రీనివాసరావు
- అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో ప్రజలకు అందాలి : కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలోనూ, రాష్ట్రంలోనూ కమ్యూనిస్టులు బలపడాలని, అప్పుడే ప్రజలకు సరైన న్యాయం అందుతుందని, అసమానతలు లేని అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు మేధావులు, విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం రూపొందించిన ప్రజాప్రణాళికపై శుక్రవారం విజయవాడ బాలోత్సవ భవన్లో సమాలోచన కార్యక్రమం జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైన వారు పలు సూచనలు చేశారు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ప్రజా ప్రణాళికను మరింత పరిపుష్టం చేస్తామని వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వామపక్షాలు బలోపేతం అవ్వాల్సిన అవసరం ఉందని, దానివల్లే అభివృద్ధి సాధ్యమవు తుందని సమావేశానికి హాజరైన మేధావులు, విద్యావంతులు అన్నారు. సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక నిజమైన అభివృద్ధికి సంకేతంగా ఉందని వారు చెప్పారు. క్షేత్ర స్థాయిలో మరింతగా చర్చ జరపాలని, వివిధ సంఘాల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని సూచించారు. వి. శ్రీనివాసరావు స్పందిస్తూ ప్రజా ప్రణాళికతో ప్రజల్లోకి వెళతామని, సిపిఎం స్వతంత్రపునాదికి కృషిచేస్తామని, వామపక్ష శక్తులతో కలిసి పనిచేస్తామని తెలిపారు.


సంపద పెరగాలి

రాష్ట్రంలో అభివృద్ధి ద్వారా సంపద పెరగాలని, అది ప్రజలందరికీ చేరాలని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్టే అభివృద్ధి అనే చర్చ, జరుగుతోందని, అది సరైంది కాదని చెప్పారు. అభివృద్ధి అనేది కార్పోరేట్ సెక్టార్‌కు రాయితీ ఇచ్చేదిగా ఉండకూడదన్నారు. సంపద పెరుగుదల శ్రమ, పారిశ్రామికరంగంలో కనబడాలని అన్నారు. విద్య, వైద్యం, రిటైల్ ట్రేడ్ అనేవి పెరగకుండా అభివృద్ధి సాధ్యం కాదన్నారు.

సంపద పెరగాలని, ప్రజల ఆదాయం పెరగాలని, అది కొద్దిమంది చేతుల్లోకి కాకుండా అందరికీ చేరాలని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు పరోక్షంగా సంపద పెరుగుదలకు తోడ్పతాయని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లలో పరిశ్రమలు పెట్టడానికి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు పెట్టలేదని అన్నారు. రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తప్ప చెప్పుకోదగిన పరిశ్రమలు రాలేదని, కియా ఒకటే వచ్చిందని చెప్పారు. అచ్యుతాపురం, హిందూపురం లో గార్మెంట్ పరిశ్రమ కూడా దెబ్బతింటోందని అన్నారు. పారిశ్రామిక, వాణిజ్య రంగం దిగజారు తోందని, అభివృద్ధి కనబడటం లేదని తెలిపారు. విశాఖలో రాజధాని అంటే అక్కడ ఐటి మిగతా 2లో

కెసిఆర్‌కు శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తుంటి ఎముకకు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని యశోద వైద్యులు తెలిపారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఉంటున్న కెసిఆర్ గురువారం అర్ధరాత్రి బాత్ రూంలో కాలుజారి కిందపడ్డారు. కాలుకి గాయం కావడంతో ఆయనను హుటాహుటిన సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించారు. కెసిఆర్‌కు ఎడమ తుంటి ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం సర్జరీ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు. ఆస్పత్రిలో కెసిఆర్‌ను బిఆర్ఎస్ నేతలు, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి పరామర్శించారు. కెసిఆర్ ఆరోగ్య పరిస్థితిపై సిఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి రిజ్విని ఆదేశించారు. కెసిఆర్ ఆరోగ్యంపై ఎపి సిఎం జగన్ ఫోన్‌లో పరామర్శించారు. కెటిఆర్‌కు ఫోన్‌చేసి.. కెసిఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కెసిఆర్ త్వరగా కోలుకోవాలని ప్రధాని మోడీ, ఎపి మాజీ సిఎం చంద్రబాబు నాయుడు, టిడిపి నేత లోకేష్ ట్వీట్ చేశారు.

అండగా ఉంటాం : జగన్

- ప్రతి రైతునూ ఆదుకుంటాం

తుపాను పీడిత ప్రాంతాల్లో నేతల పర్యటన

సర్కార్‌ది నిర్లక్ష్యం? : బాబు

- ఎకరాకు రూ. 30వేలు పరిహారం ఇవ్వాలి



బాపట్లలో వరి పైరును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్



గుంటూరు జిల్లా తెనాలి మండలం పెదరావూరులో నీటమునిగిన వరి పంటను పరిశీలిస్తున్న చంద్రబాబు

2

గుండెపోటుతో ఉపాధి కార్మికుడి మృతి

ప్రజాశక్తి - కాళ్ల (పశ్చిమగోదావరి జిల్లా)

గుండెపోటుతో ఉపాధి హామీ కార్మికుడు మృతి చెందిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఉపాధి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్లకూరు గ్రామానికి చెందిన సోడదాసి గాబ్రియేలు (72) తోటి కార్మికులతో కలిసి ఉపాధి హామీ పనికి వెళ్లారు. గ్రామ సమీపంలోని కాలువలో మట్టి తీస్తుండగా గుండెల్లో నొప్పిగా అనిపించడంతో కాల్వలో నుంచి గట్టుపైకి ఎక్కారు. కొద్దిక్షణాల్లో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకర్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం గాబ్రియేలుకు డెత్ క్లెయిమ్ వర్తిస్తుందని టెక్నికల్ అసిస్టెంట్ రమేష్‌బాబు తెలిపారు.

15 మంది సిఐలకు డిఎస్‌పిలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 15 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు డిఎస్‌పిలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు రేంజ్ పరిధిలోని ఎస్ వాహిద్ బాషా, జి రాజేంద్రప్రసాద్, బి పార్థసారథి, కె రసూల్‌సాహెబ్, పి రవిబాబు, గుంటూరు రేంజ్ పరిధిలో ఎం హనుమంతరావు, టివి రత్నస్వామి, ఎస్‌కె అబ్దుల్ కరీం, కొంపల్లి వెంకటేశ్వరరావు, విశాఖ రేంజ్ పరిధిలో డి శ్రీహరి రాజు, ఎస్ తాతారావు, ఏలూరు పరిధిలో ఎం కిశోర్‌బాబు, డిఎన్‌వి ప్రసాద్, జి రత్నరాజు, సిహెచ్ ఎస్‌ఆర్ కోటేశ్వరరావుకు ఉద్యోగోన్నతులు కల్పించారు.

సవరణ

తుపానులో వర్షాభావం శీర్షికన ఈ నెల 8న ప్రచురితమైన కథనానికి కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి సంబంధించిన ఫొటో ప్రచురితమైంది. ఆ ఫొటోను ఫైల్ ఫొటోగా పరిగణించగలరు. పొరపాటుకు చింతిస్తున్నాము.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కార్పొరేషన్‌కు టిటిడి నిధులపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) నిధులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుధ్యం, రోడ్ల పనులకు వినియోగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. తిరుపతికి చెందిన జి భానుప్రకాష్ పిల్ దాఖలు చేశారు. ఏటా టిటిడి నిధులు రూ.100 కోట్లు కార్పొరేషన్‌లోని పనులకు ఖర్చు చేసేందుకు ఆలయ ఇఒ ఆమోదం చెప్పడం చట్ట వ్యతిరేకమని, పనుల నిర్వహణకు టెండర్లు పిలవడాన్ని రద్దు చేయాలని పిల్‌లో పేర్కొన్నారు. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి, టిటిడి ఇఒ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. టెండర్ల దాఖలుకు ఈ నెల 7 చివరి తేదీ అని, ఈ నెల 16న బోర్డు సమావేశంలో బిడ్లను ఆమోదించే అవకాశం ఉందని, వెంటనే టెండర్ ప్రక్రియను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని పిల్‌లో హైకోర్టును కోరారు.

14న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 14న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. తొలుత ఈ నెల 11న ఉదయం 11 గంటలకు సచివాలయంలో మంత్రివర్గ సమావేశం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరగనుందని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ సమావేశాన్ని ఈ నెల 14కు మార్చినట్లు సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశం నేపథ్యంలో ఈ నెల 12న సాయంత్రం నాలుగు గంటల్లోగా హెచ్‌ఒడిలు ఆయా శాఖలకు సంబంధించిన సమాచారాన్ని అందజేయాలని ఆదేశించారు.

రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపానుతో తీవ్రంగా నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా జూపూడి, ఇబ్రహీంపట్నం ప్రాంత పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. తుపాను దెబ్బతో ఎంతో నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రుద్రరాజుతోపాటు ఎన్‌టిఆర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బుర్రా కిరణ్, జనరల్ సెక్రటరీ ఏసుదాసు ఉన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల విలీన కష్టాలు

- అలవెన్సులు ఇవ్వరు.. ఉద్యోగోన్నతులు చేపట్టరు
- స్పందించని ప్రభుత్వం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమైతే అన్ని కష్టాలకూ కాలం చెల్లుతుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వంలో విలీనమయ్యాక ఆర్‌టిసి ఉద్యోగుల కష్టాలు తగ్గకపోగా, గతం కంటే పెరగడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసిలో వున్నపుడు ఉద్యోగికి ఏ సమస్య వచ్చినా నేరుగా యజమాన్యంతో చెప్పుకునే వెసులుబాటు వుండేది. ఇప్పుడు ఆర్‌టిసి ఎమ్‌డికి వినతి ఇచ్చినా ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పడం తప్ప పరిష్కారానికి చొరవ తీసుకునే వ్యవస్థ లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఒపిఎస్ వస్తుందని ఆశపడ్డా.. అది ఇవ్వలేమని సిపిఎస్ గానీ జిపిఎస్ గానీ తీసుకోవాలని యజమాన్యం చెబుతోంది. సిపిఎస్, జిపిఎస్ కంటే ఇపిఎఫ్ ద్వారా వచ్చే పెన్షన్ మేలని ఉద్యోగులు ఎక్కువ మంది అటువైపు మొగ్గుచూపుతున్న పరిస్థితి వుంది. అలాగే సరెండర్ సెలవులకు సంబంధించి ప్రభుత్వం మూడేళ్లుగా బకాయిలు పెట్టింది. అన్ని ప్రభుత్వశాఖల తరహాలో ఉద్యోగోన్నతులు కల్పించాలని ఎప్పట్నుంచో ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. 8వ తరగతి అర్హతతో డ్రైవర్, 10వ తరగతి అర్హతతో కండక్టర్లు ఆర్‌టిసిలో ఎక్కువగా వున్నారు. ఎడిసి, ట్రాఫిక్‌లలో ఇచ్చే ఉద్యోగోన్నతుల్లో ఇప్పటి దాకా సగటున 25 ఏళ్లు దాటిన డ్రైవర్లు, కండక్టర్లకు ఉద్యోగోన్నతులు లభించేవి. అయితే ప్రభుత్వంలో విలీనమయ్యాక ఎడిసి పోస్టు జూనియర్ అసిస్టెంట్ పోస్టుతో సమానమని, డిగ్రీ వుంటేనే ఉద్యోగోన్నతి అంటూ ఆర్‌టిసి యాజమాన్యం చెప్పడంతో ఆర్‌టిసిలోని అన్ని ఉద్యోగ సంఘాలు ఉద్యమబాట పట్టాయి. విద్యార్హతతో ప్రమేయం లేకుండా పాతపద్ధతిలో ఉద్యోగోన్నతులకు అవకాశం కల్పించాలనే డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసిలో పాత నిబంధనలతోనే ఉద్యోగోన్నతులు కల్పించేలా ఉత్తర్వులిచ్చింది. అయితే ఆ ఉత్తర్వులు అమలు చేయని పరిస్థితి వుంది. అంతేకాకుండా ఆర్‌టిసి ఉద్యోగులకు అన్ని రకాల అలవెన్సులు ప్రభుత్వంలో విలీనమైనప్పటి నుంచి నిలిపేశారు. అలవెన్సుల అంశంలో ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు. ఆరోగ్య సమస్యల అంశంలోనూ ఉద్యోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

విశాఖకు ఆఫీసుల తరలింపును అడ్డుకోండి

హైకోర్టులో పిటిషనరు వాదన

ప్రజాశక్తి-అమరావతి

సిఎం క్యాంపు కార్యాలయం తరలింపు పేరుతో ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలింపు ప్రయత్నాలను అడ్డుకోవాలనే వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి విచారణ చేయొచ్చునని పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వకేట్ ఉన్నం మురళీధరరావు వాదించారు. ఈ అంశం పిల్ కిందకు వస్తుందనే ప్రభుత్వ వాదనను తోసిపుచ్చారు. తమకు కావాల్సిన న్యాయమూర్తి దగ్గర విచారణకు వచ్చేలా పిటిషన్ వేశారని (బెంచ్ హంటింగ్) ప్రభుత్వం చేసిన వాదనను ఆయన తోసిపుచ్చారు. ప్రభుత్వం తరపున ఎజినే బెంచ్ హంటింగ్ చేస్తున్నారని చెప్పారు. ఎజి వాదన కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో సిఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు ముసుగులో ప్రభుత్వ కార్యాలయాలు విశాఖకు తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ అమరావతి పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్టీ తిరుపతిరావు, రాజధాని రైతులు మాదాల శ్రీనివాసరావు, వలపర్ల మనోహరం పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 22న జారీ చేసిన జిఓ 2283 రద్దు చేయాలని కోరారు. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శుక్రవారం విచారించారు. ప్రధాన వ్యాజ్యంపై లోతైన విచారణ చేయాల్సి వుందన్నారు. విచారణను సోమవారానికి వాయిదా వేశారు. విశాఖలోని కాపులుప్పాడ కొండపై స్టేట్ గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్‌కు సంబంధించిన 30 ఎకరాలను ప్రభుత్వానికి బదిలీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు గతంలో స్టే ఇచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలించేందుకు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు కూడా ప్రభుత్వానికి ఇరకాటంలోకి నెట్టాయి. ఈ నేపథ్యంలో పర్యాటక రిసార్ట్ పేరుతో రిషికొండపై ప్రభుత్వం భవనాలను నిర్మించి దానిని సిఎం క్యాంపు కార్యాలయంగా మార్చింది. ఇప్పుడు ఆఫీసుల తరలింపు చర్యలు తీసుకుంటోంది. ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరిట జరుగుతున్న బాగోతాన్ని అడ్డుకోవాలని పిటిషనర్ల తరపున మురళీధరరావు వాదించారు. ఈ అంశంపై పిల్ మాత్రమే వేయాలని, పిటిషన్ దాఖలు చేయకూడదని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. తదుపరి విచారణ ఈ నెల 11వ తేదీకి వాయిదా పడింది.

21 తర్వాత మున్సిపల్ కార్మికుల సమ్మె

- మంత్రి సురేష్‌కు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంటు కోరుతూ.. ఈ నెల 21 తర్వాత మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) పేర్కొంది. సచివాలయంలో మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మిని శుక్రవారం ఫెడరేషన్ నాయకులు కె ఉమామహేశ్వరరావు, బి సోమయ్య, బి ముత్యాలరావు, గార్లపాటి లక్ష్మి, పి శ్రీనివాసరావు నేతృత్వంలోని బృందం కలిసి సమ్మె నోటీసు అందజేశారు. వడ్డేశ్వరంలోని సిఎమ్‌డిఎ కార్యాలయంలో డిఎంఎ పి కోటేశ్వరరావుకూ సమ్మె నోటీసు అందజేశారు.



అభివాదం చేస్తున్న చిత్రయూనిట్, పోరాట కమిటీ సభ్యులు

ఉద్యమ స్ఫూర్తితో 'ఉక్కు సత్యాగ్రహి' చిత్ర నిర్మాణం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఉద్యమ స్ఫూర్తితో, ప్రజాకవి, పోరాట యోధుడు గద్దర్ ఆదేశాల మేరకు ఉక్కు సత్యాగ్రహి సినిమాను తాను నిర్మించినట్టు దర్శకుడు, నిర్మాత, నటుడు పి.సత్యారెడ్డి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద చిత్ర యూనిట్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ చిత్ర విశేషాలను స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులతో పంచుకున్నారు. ఈ చిత్రంలో విశాఖ పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ నటించినట్టు తెలిపారు. సినిమాలో గద్దర్ రాసిన నాలుగు పాటలు ఉద్యమ స్ఫూర్తిని మరింతగా పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని డబ్బు కోసం తాను నిర్మించలేదని, ఉద్యమ బలోపేతానికి దోహదపడుతుందని తీశానని తెలిపారు. ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఈ నెల 13న ఉంటుందని, 15న ప్రేక్షకుల ముందుకు వస్తుందని అన్నారు. చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేయాలని కోరారు. నటి పల్సర్ బైకు ఝాన్సీ మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా ఈ చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం ఇచ్చిన గద్దర్‌కు, సత్యారెడ్డికి అభినందనలు తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. ఈ చిత్ర సందేశం ప్రజలకు మరింత చేరువై ఈ పోరాటం ప్రజా ఉద్యమంగా అవతరించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు కారు రమణ, వై.మస్తానప్ప, డి.సురేష్ బాబు, వరసాల శ్రీనివాస్, డేవిడ్, నమ్మి సింహాద్రి, సిహెచ్.సన్యాసిరావు, పరంధామయ్య, పుల్లారావు పాల్గొన్నారు.

తెలంగాణలో నేటి నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీ కార్యరూపం దాల్చనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో నివాసితులైన బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మొదటిగా దీన్ని అమలు చేస్తున్నారు. అయితే, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించారు. సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో కూడా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ మేరకు రవాణా శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. స్థానికత గుర్తింపు కార్డు చూపించి తెలంగాణ అంతటా మహిళలు ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్‌టిసి ఎండి సజ్జనార్ తెలిపారు. కాగా, మహిళల ఉచిత ప్రయాణానికి అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసికి చెల్లించనుంది.

బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలపై విధి విధానాలు సిద్ధం చేయండి

- అధికారులకు మంత్రి విడదల రజిని ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే ఏడాది ప్రారంభమయ్యే 5 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల కోసం విధి విధానాలు సిద్ధం చేయాలని అధికారులకు వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల, పాడేరులో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రారంభమయ్యే మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ తరగతుల నిర్వహణకు విధి విధానాలు సిద్ధం చేయాలన్నారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్ ఏడో ఫ్లోర్ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి విడదల రజిని సమీక్షించారు.

ముఖ్యంగా బోధనా సిబ్బంది నియామకాలను ఎలా చేపట్టాలన్న విషయంలో ప్రతిపాదనలను సిద్ధం చేయాలని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న బోధనా సిబ్బంది పిల్లలకు ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపులో రిజర్వేషన్లు కల్పించే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖలో 53 వేలకు పైగా సిబ్బందిని నియమించామని ఆమె తెలిపారు.

వారణాసిలో మండపేట వాసుల ఆత్మహత్య


అప్పులు తీర్చలేకనే బలవన్మరణం : పోలీసులు




కొండబాబు



లావణ్య



రాజేష్



జయరాజ్

ప్రజాశక్తి - మండపేట (డాక్టర్ బిఆర్.అంబేద్కర కోనసీమ జిల్లా)

అప్పుల బాధ తాళలేక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన ఓ కుటుంబం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలోని ఓ కాటేజీలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వారణాసిలోని దశాశ్వమేధ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవనాథ్‌పూర్ ప్రాంతంలోని ధర్మశాలలో కాటేజ్‌లోని ఓ గదిలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. మృతులు మండపేటకు చెందిన గుండవరపు కొండబాబు(50), లావణ్య(45) దంపతులతో పాటు వారి కుమారులు రాజేష్(25), జయరాజ్(23)లుగా అక్కడి పోలీసులు గుర్తించారు.

గురువారం సాయంత్రం వరకు కాటేజీ నుంచి కొండబాబు కుటుంబ సభ్యులు ఎవరూ బయటకు రాలేదు. ఐదు గంటల ప్రాంతంలో రూమ్‌ను క్లీన్ చేసేందుకు స్వీపర్ వచ్చి తలుపు తట్టినా తెరవలేదు. దీంతో కిటికీలోంచి స్వీపర్ లోపలికి చూశాడు. నలుగురి మృతదేహాలు వేలాడుతూ ఉండటంతో కాటేజీ యజమానులకు సమాచారం ఇచ్చారు. వారి సమాచారం మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. బస చేసిన గదిలోని పలు వస్తువులను పోలీసులు గుర్తించారు. పెట్రోల్ నింపిన మూడు బాటిల్స్ కూడా స్వాధీనం చేసుకున్నారు. గదిలో కొంత విషపూరిత పదార్థం, కొన్ని మందులను, సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆత్మహత్య చేసుకోవాలనే కుటుంబమంతా కాశీకి వచ్చారని ఉత్తరప్రదేశ్ పోలీసులు స్పష్టం చేశారు. అప్పుల వివరాలను సూసైడ్ నోట్లో రాశారని పేర్కొన్నారు.

సూసైడ్ నోట్‌లో పేర్కొన్న వ్యక్తులను విచారించేందుకు ఎపి పోలీసులను సంప్రందించినట్లు తెలిపారు. ఈ కుటుంబం రెండు నెలలుగా వివిధ ఆలయాలను సందర్శించినట్లు గుర్తించారు.

కొండబాబు స్థానిక పెద్ద కాల్వ సమీపంలో మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నారు. కుటుంబం మాత్రం గాంధీనగర్‌లో ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. డిసెంబర్ మూడున వీరంతా వారణాసి వెళ్లారు. కుటుంబ పోషణ నిమిత్తం కొండబాబు దొరికిన చోటల్లా అప్పులు చేశారు. వాటిని తీర్చకపోవడంతో వడ్డీలు పెరిగిపోయాయి. ఈ సమయంలో అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి ఎక్కువైంది. అందువల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

కమ్యూనిస్టులు బలపడాలి

(మొదటిపేజీ తరువాయి)

భవనాలు ఖాళీ చేసి ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలుకు డబ్బులు కూడా జనం మీద పన్నులు, భారాలు వేసి సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సామాన్య ప్రజలు కట్టే పన్నుల పెరుగుతున్నాయని, కార్పొరేట్ కంపెనీలు వేలకోట్లు ఎగ్గొడుతున్నాయని అన్నారు. మన రాష్ట్రంలో 150 మంది విల్‌ఫుల్ డిఫాల్టర్లు ఉన్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు కూడా డబ్బులు ఎగ్గొట్టినవారిలో ఉన్నారని తెలిపారు.

ప్రజలు అభివృద్ధి చెందాలి : కె.ఎస్.లక్ష్మణరావు

అభివృద్ధి అంటే ప్రజలు, సమాజం అభివృద్ధి చెందాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతోందని, వృద్ధిపై చర్చ చేయడానికి ఇదే సరైన సమయమని చెప్పారు. నయా ఉదారవాద విధానాలతో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. చంద్రబాబు హయాంలో అమరావతి, రియల్ ఎస్టేట్ చుట్టూ వ్యవహారం నడిపారని, జగన్ మోహన్‌రెడ్డి డిబిటి చుట్టూ వ్యవహారం నడుపుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిని సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేయాలని, ప్రపంచవ్యాప్తంగా మానవాభివృద్ధి సాధించాలన్నారు. విద్య,ఆరోగ్యం, అక్షరాస్యత, శిశు మరణాలు ఎలా ఉన్నాయనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. మన దేశంలో కేరళ మానవాభివృద్ధిలో మొదటిస్థానంలో ఉందని, ఎపి 12వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధిపై చర్చకు సిపిఎం కృషి చేసిందన్నారు.

రవాణా రంగంపైనా దృష్టి పెట్టాలి: చెన్నుపాటి వజీర్

సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక బాగుందని, అదే సమయంలో రవాణా రంగం, దాని అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారిపైనా దృష్టి పెట్టాలని లారీ యజమానుల సంఘం నాయకులు చెన్నుపాటి వజీర్ సూచించారు. ఈ రంగానికి చెందిన వారు 80 లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. దీన్ని ప్రత్యేకంగా చూసి ప్రజా ప్రణాళికలో చోటు కల్పించాలని కోరారు. అసంఘటిత రంగానికి ప్రభుత్వం అండగా ఉండాలని, అక్కున చేర్చుకోవాలని లేనిపక్షంలో తీవ్రంగా నష్టపోతారని తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలి : డాక్టర్ సుధాకర్

ప్రజలకు నివాసం అనేది కీలకమని ప్రజా వైద్యశాల వైద్యులు డాక్టర్ సుధాకర్ అన్నారు. 'ఇళ్లు కల్పించడం ప్రభుత్వాలు ప్రధాన ఉద్దేశంగా ఉండాలి. ఇప్పటికీ పట్టణ ప్రాంతాల్లో అనేక మంది పేదలు రోడ్డుపైనే ఉంటున్నారు. అటువంటి వారిని చూసిన సమయంలో బాధ కలుగుతోంది. ఇంత అభివృద్ధి అని ప్రభుత్వాలు చెబుతుంటే ఇంకా ఎందుకు ఈ పరిస్థితి వచ్చిందనేది అర్థం కాని విషయంగా ఉంది.' అని ఆయన అన్నారు.

విద్యారంగాన్ని కాపాడాలి : డాక్టర్ పరిమి

ప్రస్తుతం రాష్ట్రంలో అమలు జరుగుతున్న విద్యావిధానంపై చర్చ జరగాలని విద్యావేత్త డాక్టర్ పరిమి అన్నారు. ఇప్పుడు అమల్లోకి వస్తున్న విధానం వల్ల సామాన్య విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు.

సదుపాయాలు పెంచాలి : వ్యాపారవేత్త బిఎస్.కోటేశ్వరరావు

గ్రామీణ ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాలకు రవాణా సదుపాయాలు పెంచాల్సిన అవసరం వ్యాపారవేత్త బిఎస్ కోటేశ్వరరావు అన్నారు. . దీనివల్ల పట్టణాల్లోనూ ఒత్తిడి తగ్గుతుందని, చిరు వృత్తిదారులు, కూలీ పనులు చేసుకునేవారికి అద్దెల రూపంలో భారం కూడా తగ్గుతుందని చెప్పారు. అలాగే విద్యా, వైద్య సదుపాయాలు పెంచాలి. న్యాయవ్యవస్థలోనూ మార్పులు చేయాలని అన్నారు.

అన్ని రంగాల అభిప్రాయాలు తీసుకోవాలి కొరివి వినయ్‌కుమార్

సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళికను మరింత విస్తృతం చేయాలని సామాజిక వేత్త కొరివి వినయ్‌కుమార్ సూచించారు. దీనిని అన్ని రంగాల ప్రజల వద్దకూ తీసుకెళ్లాలని చెప్పారు. వారికి వివరించి అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రజలు, సంఘాలు, సంస్థల అభిప్రాయాలనూ ఇందులో చేర్చాలన్నారు. దీనివల్ల సమగ్ర సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

సంక్షేమం వేరు, ఉచితాలు వేరు : నేతి మహేశ్వరరావు

రాష్ట్రం సమగ్రాభివృద్ధి జరగాలంటే విస్తృత చర్చ అవసరమని ఆంధ్రా ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షులు నేతి మహేశ్వరరావు అన్నారు. ఉచితాలు ఇచ్చి వాటినే సంక్షేమం అంటున్నారని, వాస్తవానికి అది సంక్షేమం కాదని అన్నారు. సంక్షేమం వేరే, ఉచితాలు వేరనే విషయం అందరూ అర్థం చేసుకోవాలి. ప్రభుత్వాలు వారికి తోచిన విధంగా చేసుకుపోవడం సరికాదు.

కమ్యూనిస్టులు సమన్వయం చేసుకోవాలి : మల్లికార్జునరావు

కమ్యూనిస్టులు సమన్వయం చేసుకుని ప్రజల్లోకి వెళ్లడం ద్వారా బలోపేతం కావాలని చలువాది మల్లికార్జునరావు అన్నారు. దానివల్ల ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతుంది.

ఉపాధి కల్పన పెరగాలి

రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతోందని సామాజికవేత్త డాక్టర్ వసుంధర అన్నారు. పట్టణాల్లో 12 శాతం నిరుద్యోగం ఉందని చెప్పారు. ఉపాధి కల్పన పెరగాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న నాడు నేడు వెనుక ప్రపంచ బ్యాంకు సూచనలు ఉన్నాయన్నారు. . అలాగే ప్రాజెక్టులు, ఉపాధికోసం పరిశ్రమలు చేపట్టం ద్వారా రాష్ట్రం అభివృద్ధి జరుగుతుంది. వీరితోపాటు అభ్యుదయ రచయిత సంఘం నాయకులు చలసాని అజయ్, మెడికల్ రిప్స్ నాయకులు యు.వి.కృష్ణయ్య, వ్యాపారవేత్త కొండలరావు, నగర ప్రముఖులు వై.సుబ్బారావు, బిఎస్‌ఎన్‌ఎల్ నాయకులు చంద్రశేఖర్, ట్యాక్స్ పేయర్స్ నాయకులు వి.సాంబిరెడ్డి, జర్నలిస్టు వి.వెంకటేశ్వర్లు, పెన్షనర్ల సంఘం నాయకులు ప్రభుదాసు తదితరులు మాట్లాడారు.

అండగా ఉంటాం : సిఎం జగన్

- ప్రతి రైతునూ ఆదుకుంటాం

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా, కోట (తిరుపతి జిల్లా)

కష్టకాలంలో తమ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటా మని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మిచౌంగ్ తుపాను వల్ల తిరుపతి, బాపట్ల జిల్లాల్లో నష్టపోయిన ప్రాంతాల్లో శుక్రవారం సిఎం పర్యటించారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం బుద్ధాం, పాతనందాయ పాలెంలో, తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం సిఎం పర్యటన సాగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను ఆయన చూశారు. రైతులనుండి నష్ట తీవ్రతను తెలుసుకున్నారు. వారి నుద్దేశించి మాట్లా డారు. తమ ప్రభుత్వంలో మంచే జరుగుతుంది తప్ప.. ఏ ఒక్కరికీ చెడు జరగదని అన్నారు. తుపాను వల్ల వాటర్ లాగింగ్ జరిగి అందరూ ఇబ్బందులు పడ్డారన్నారు. నష్టం జరిగిన వారిని గుర్తించి సచివాలయంలో సోషల్ ఆడిట్‌కు పేర్లు పెట్టనున్నట్లు తెలిపారు. అత్యంత పారదర్శకం గా ఈ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇంతకు ముందు కరువు, వరదలు వచ్చినా పట్టించుకున్న పరిస్థితులు లేవని తెలిపారు. పంట నష్టానికి సంబంధించి, ఎవరైనా ఇన్ పుట్ సబ్సిడీ రాదనో, ఇంకొకటి రాదనో చెబితే నమ్మవద్దని రైతులనుద్దేశించి ఆయన అన్నారు. 'ఇది మీ బిడ్డ ప్రభుత్వం ... ఎటువంటి పరిస్థితుల్లోనూ మీకు అన్యాయం జరగదు.' అని ఆయన అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో నష్టం జరిగితే, మళ్లీ ఖరీఫ్ సీజన్ వచ్చేలోపే ఇన్సూరెన్స్ ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. పునరావాస కేంద్రంలో ఉన్నవారికి, ఇళ్లలోకి నీరు వచ్చిన వారికి రూ.2,500 ఇస్తామని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామన్నారు. వర్షం వల్ల రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు 25 కేజీల రేషన్ బియ్యంతోపాటు నిత్యావసరాలను పంపిణీ చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఇంటికీ వలంటీర్ వచ్చి రూ.2,500 ఇస్తారన్నారు.

నష్టపోయిన రైతుకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తామన్నారు. దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించే పనులు చేపడతామని తెలిపారు. ముఖ్యమంత్రి వెంట వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, తానేటి వనిత, ఎమ్మెల్యేలు, అధికారులు ఉన్నారు.

సర్కారు ఎక్కడ? : బాబు

- ఎకరాకు రూ. 30వేలు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-అమర్తలూరు, తెనాలి

తుపాన్‌తో జన జీవితం అతలాకుతల మౌతుంటే ప్రభుత్వం ఎక్కడుంది... ఏం చేస్తోంది? అని ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తెనాలి రూరల్ మండలం నందివెలుగు, పెదరావూరు, బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం, అమర్తలూరు మండలం, కూచిపూడి పెదపూడి గ్రామాలలో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతుల నుండి వివరాలు సేకరించారు. పలుచోట్ల బాధితుల నుద్దేశించి మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వచ్చిన హుద్‌హుద్ తుపాన్ సమయంలో రెండోరోజే ప్రధాన మంత్రిని రాష్ట్రానికి తీసుకువచ్చామని చెప్పారు. ప్రస్తుత గాడి తప్పిన పాలనలో ఇంతవరకు కేంద్ర బలగాలు కూడా రాలేదని అన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు గుంటూరు జిల్లాలో 90 శాతం పంట నీటిపాలైందన్నారు. ఇక్కడ మానవ తప్పిదం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పంట కాలువలు, డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ఆ ప్రభావం రైతులపై పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చెల్లించాల్సిన ఫసల్ బీమాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. 2014కు ముందు ఇన్‌పుట్‌సబ్సిడీ ఎకరానికి రూ 10 వేలు చెల్లిస్తుంటే దానిని తన హయాంలో రూ.20 వేలకు పెంచామన్నారు. ఆ ప్రకారం ప్రస్తుతం ఎకరానికి కనీసం రూ.30 వేలైనా పరి హారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంద న్నారు. పంట నష్టపోయిన రైతుల ఆధారాలు తమ వద్ద ఉంచుకోవాలని, వారికి న్యాయం జరిగేలా తాను పోరాడతానని హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించకుంటే, మరో మూడు నెలల్లో తమ ప్రభుత్వం వస్తుందని, ఆ వెంటనే రైతులను ఆదుకుంటామని చెప్పారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎలాంటి తప్పు చేయకపోయినా, అక్రమ కేసులు బనాయించి 52 రోజులు జైల్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఉంది కదా అని విర్రవీగితే తెలంగాణ మాదిరి ఫలితాలే ఎదురవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, సీనియర్ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఓట్లపై చర్యకు కలెక్టర్లకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పక్క రాష్ట్రాలకు చెందిన వారికి ఓటు ఇచ్చే అంశంపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. హైదరాబాద్, బెంగళూరులోని ఓటర్లుగా వుండి, రాష్ట్రంలో కూడా ఓటు కలిగి వున్నారని, అలాంటి ఓటర్లను తొలగించాలని వైసిపి చేసిన ఫిర్యాదుపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఈ మేరకు వైసిపికి లేఖ రాసింది. రాష్ట్రంలో డూప్లికేట్, డబుల్ ఓట్లపై చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు. 'ఒక వ్యక్తికి ఒకే నియోజకవర్గం, ఒకే రాష్ట్రంలో ఓటు ఉండాలి. ఒక వ్యక్తికి ఎక్కువ చోట్ల ఓటు ఉండటం నిబంధనలకు విరుద్ధం' అని పేర్కొన్నారు. ఫామ్ 6 ద్వారా కొత్త ఓటు నమోదు మాత్రమే చేయాలని, కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు డిక్లరేషన్ తీసుకోవాలని తెలిపారు. తప్పుడు డిక్లరేషన్ ఇచ్చే వారిపై కేసులు పెడతామన్నారు. 20 ఏళ్లు పైబడ్డ వాళ్లు ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేస్తే అధికారులు విచారించి రిమార్క్ ఇవ్వాలన్నారు. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటు హక్కు, ఇళ్లు మారే వాళ్లు ఓటుకు ఫామ్ 8 ద్వారా డిక్లరేషన్ ఇవ్వాల్సి వుంటుందని పేర్కొన్నారు.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. చంద్రబాబుకు బెయిల్ ఇస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. నోటీసులు జారీ చేసినా ఇంకా కౌంటర్ దాఖలు చేయలేదని ప్రభుత్వం తరపున న్యాయవాది రంజిత్ కుమార్ ధర్మాసనానికి తెలిపారు. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపిస్తూ.. తాము కౌంటర్ దాఖలు చేయడానికి సిద్ధంగానే ఉన్నామని, కానీ 17ఏ తీర్పుతో ముడిపడి ఉందన్న విషయాన్ని సాల్వే ప్రస్తావించారు. 17ఏ వ్యవహారంపై తీర్పు ఇచ్చేటట్లు అయితే వాయిదా వేయాలని, లేదా విచారణ తేదీ ఖరారు చేయాలని ధర్మాసనాన్ని కోరారు. దీంతో ధర్మాసనం విచారణను జనవరి మూడో వారంలో చేపడతామని తెలిపింది. విచారణకు ఏదో ఒక తేదీ ఖరారు చేయాలని సాల్వే కోరగా.. ఆయన విజ్ఞప్తితో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌ను జనవరి 19కి వాయిదా వేసింది. ఈ లోపు కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరపున న్యాయవాదులను, దానికి రిజాయిండర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది.

ఉచిత విద్యుత్‌ను ఎత్తేసేందుకు కుట్ర

వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే ప్రతిఘటిస్తాం : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను ఎత్తేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కుట్రలు చేస్తోందని, దొడ్డిదారిన రైతులను మభ్యపెడుతూ మీటర్లను పెడితే ప్రతిఘటిస్తామని ఎపి రైతు సంఘం పేర్కొంది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చెప్పిన ప్రతి అంశానికీ తలూపుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు ఇస్తున్న సబ్సిడీని ఎత్తివేసేందుకే కేంద్రం చెప్పినట్లు వ్యవసాయ మీటర్లకు రాష్ట్ర ప్రభుత్వం మీటర్లను పెడుతోందని విమర్శించారు. శ్రీకాకుళంలో పైలెట్ ప్రాజెక్టును పెట్టినపుడు రైతుల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కు తగ్గిన ప్రభుత్వం.. ఇప్పుడు మోటార్లకు మీటర్లు పెట్టేందుకు మళ్లీ పూనుకోవడం తగదన్నారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈ మేరకు వ్యవసాయ మోటార్లకు మీటర్లను పెట్టుకోవాలని విద్యుత్‌శాఖాధికారులు సమావేశాలు వేసి చెబుతున్నారని తెలిపారు. వ్యవసాయానికి వాడుకున్న ప్రతి హెచ్‌పికీ రూ1,150 మీ ఖాతాల్లో జమచేస్తామని కొన్ని మండలాల్లో రైతుల నుండి ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాల వివరాలను సేకరిస్తున్నారని అన్నారు. రైతులకు ఎన్ని బోర్లు వుంటే.. అన్నింటికీ ఇస్తామని చెబుతున్నారని, ఆచరణలో గ్యాస్ సబ్సిడీపై కేంద్ర ప్రభుత్వం మోసం చేసినట్లుగానే ఉచిత విద్యుత్‌లోనూ మోసం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు ప్రాంతాలైన రాయలసీమ జిల్లాల్లో ఎక్కువగా వ్యవసాయ పంపుసెట్లపై రైతులు ఆధారపడుతున్నారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ఎత్తివేస్తే కరువు ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా నగదు బదిలీ పేరుతో రైతులను మభ్యపెడుతోందని విమర్శించారు. తక్షణం మోటార్లకు మీటర్లను పెట్టే ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవసాయ కనెక్షన్‌లకు మీటర్లు పెడితే రాష్ట్ర వ్యాప్తంగా రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



డిమాండ్ల పత్రాన్ని మీడియాకు విడుదల చేస్తున్న వై కేశవరావు, వి కృష్ణయ్య, హరిబాబు

18, 20 తేదీల్లో వాకిన్ రిక్రూట్‌మెంటు

- ఎపి వైద్య సర్వీసుల రిక్రూట్‌మెంటు బోర్డు మెంబరు సెక్రటరీ ఎం శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న 170 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 18, 20 తేదీల్లో వాకిన్ రిక్రూట్‌మెంటు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య సర్వీసుల రిక్రూట్‌మెంటు బోర్డు మెంబరు సెక్రటరీ ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ పోస్టులను డైరెక్ట్, లాటరీ, కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. వివిధ స్పెషాలిటీల్లో ఖాళీగా ఏన్న 144 పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తామని అన్నారు. 18, 20 తేదీల్లో విజయవాడ హనుమాన్‌పేట పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వాకిన్ రిక్రూట్‌మెంటు ఉంటుందన్నారు. అలాగే విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్), విశాఖపట్నంలోని వివిధ స్పెషాలిటీల్లో ఖాళీగా ఉన్న 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 15న హనుమంతవాక జంక్షన్ విమ్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాకిన్ రిక్రూట్‌మెంటు ఉంటుందని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం

ఎస్ఎస్ఎ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదలని డిమాండ్ చేస్తూ ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) ఉద్యోగులు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, గ్రాడ్యుటీ కల్పించాలని నినదించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు డి.వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ కనీస వేతనం అమలు చేయాలని, రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మెరుగైన హెల్త్ స్కీం అమలు చేయాలని కోరారు. సిఆర్‌ఎంటి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల లెవల్ అకౌంట్స్ మెసెంజర్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పిఇటి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పోస్టులకు కచ్చితమైన జాబ్‌చార్టు ఇవ్వాలన్నారు. ఫీల్డ్ ఉద్యోగులకు బీమా అమలు చేయాలని, ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలకు పెంచాలని, పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందించారు. ధర్నాలో నాయకులు ఎం.రఘునాథ్, డి.చిన్నబాబు, కె.వీరపండు, కె.జగదీష్, పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు



సమావేశంలో మాట్లాడుతున్న రఘుబాబు

అన్నదాతకు బాసటగా 'రైతుకవనం'

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

పాలకులు అవలంభిస్తోన్న రైతు వ్యతిరేక విధానాలతో అన్నదాత తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నారని, రైతుకు బాసటగా నిలచి మనోధైర్యాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో కవులు, కళాకారులు తమ కళలను, గళాలను వినిపించనున్నారని సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అన్నారు. కర్నూలులోని కెకె భవన్‌లో ఎఐకెఎస్ ఆహ్వాన సంఘం నాయకులతో శుక్రవారం సాహితీ స్రవంతి నాయకులు సమావేశమై రైతుకవనం ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10న నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో రైతు సమస్యలపై కవితలు, పాటలు వినిపిస్తారని తెలిపారు. ఈ నెల 15, 16, 17న కర్నూల్లో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలకు సంఘీభావంగా రైతు కవనం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆహ్వాన సంఘం, సాహితీ స్రవంతి జిల్లా కమిటీ సంయుక్తంగా నిర్వహిస్తుందన్నారు. రైతు కవనంలో ఆహ్వాన సంఘం నాయకులు జి.పుల్లయ్య, డాక్టర్ శంకరశర్మ పాల్గొంటున్నారని వివరించారు. సమావేశంలో ఆహ్వాన సంఘం నాయకులు రామకృష్ణ, సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు బసవరాజు, ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, సహాధ్యక్షులు పార్వతయ్య పాల్గొన్నారు.

'ఓట్లలో వైసిపి అవకతవకలు'

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార పార్టీ ఓట్ల అవకతవకలకు పాల్పడుతోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు శుక్రవారం లేఖ రాశారు. ఎలక్టోరల్ మాన్యువల్-2023 ప్రకారం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు జరగడం లేదని తెలిపారు. మాన్యువల్ ప్రకారం జనాభాపరమైన సారూప్య ఎంపికలు, ఫొటోగ్రాఫిక్ సారూప్య ఎంపికలు పరిశీలించి డబుల్ ఎంట్రీలను తొలగించాలని కోరారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో మరణించిన వారి ఓట్లు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోర్స్ రూల్స్-1960 ప్రకారం ఓట్లను ఇంటి నెంబర్ల ప్రకారం క్రమంగా ఉండేలా చూడాలని, కానీ నేటికీ దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. అర్హత లేని వారికి సైతం ఫామ్-6 ద్వారా ఆన్‌లైన్‌లో ఇష్టానుసారంగా ఓట్లు నమోదు చేస్తున్నారని వివరించారు. ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. నేరుగా కానీ, ఆన్‌లైన్‌లో కానీ బల్క్‌గా ఫామ్-7 దరఖాస్తులను స్వీకరించొద్దని కోరారు. కొన్ని నియోజకవర్గాల్లో ఎటువంటి విచారణ చేయకుండా తెల్లపేపర్‌పై పేర్లు రాసిస్తే ఓట్లను తొలగిస్తున్నారని వివరించారు. ఇఆర్‌ఒలు నోటీసులు జారీ చేస్తూ ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్టు ప్రకటించి నెల గడుస్తున్నా పైన పేర్కొన్న అనేక అభ్యంతరాలపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. తుది జాబితాలో ఓట్ల అవకతవకలు మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇఆర్‌ఒలకు, డిఇఒలకు నిర్ణీత సమయం కల్లా తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు.

కెసిఆర్ సంపూర్ణంగా కోలుకోవాలి

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ త్వరితగతిన కోలుకుని తిరిగి ప్రజలకు తన సేవలు కొనసాగిస్తారని ఆశిస్తున్నట్లు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కెసిఆర్ ఎన్నో సవాళ్లను అధిగమించారని, ఈ అనారోగ్య పరిస్థితులను కూడా మనోధైర్యంతో అధిగమిస్తారనే నమ్మకం ఉందని అన్నారు.

ఆందోళనల ఫలితంగానే నీటి మీటర్ల తొలగింపు

- విజయవాడలో సిపిఎం బృందం పాదయాత్ర
- మరలా బిగించే ఆలోచన చేస్తే ఉద్యమిస్తాం : బాబూరావు



సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావుకు నీటి మీటర్‌ను చూపుతున్న మహిళ

ప్రజాశక్తి-విజయవాడ

ప్రజా ఉద్యమ ఫలితంగానే విజయవాడలో ఏర్పాటు చేసిన నీటి మీటర్లను నగరపాలక సంస్థ తొలగించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. రాబోయే సాధారణ ఎన్నికల తరువాత నీటి మీటర్లు పెట్టే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం విజయవాడ నగరంలోని మధురానగర్, పసుపుతోటలో బాబూరావు ఆధ్వర్యంలో సిపిఎం నేతలు గురువారం పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోరాటం ఫలితంగానే నగరపాలక సంస్థ అధికారులు నీటి మీటర్లు తొలగించారని స్థానిక ప్రజలు సిపిఎం నేతల దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లల్లో పెట్టిన నీటి మీటర్లను తొలగించి, వాటిని విఎంసి అధికారులు తీసుకెళ్లలేదని, గత నెల రోజులుగా మంచినీటి సరఫరా తక్కువగా వస్తుందని, అంతర్గత రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయని, చెత్త, ఆస్తి పన్నుల భారాలు ఎక్కువయ్యాయని, వర్షాలకు శానిటేషన్ నిర్వహణ సరిగాలేదని వివరించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పసుపు తోటలో బిగించిన 600 నీటి మీటర్లను ప్రజల నిరసనలతో తొలగించారని అన్నారు. వాటిని విఎంసి అధికారులు తీసుకెళ్లకుండా అలాగే ఉంచారని, సాధారణ ఎన్నికలు ముగిసిన తరువాత మరలా వాటిని బిగించే ప్రమాదముందని హెచ్చరించారు. పట్టణ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలోని పసుపుతోటలో 600 నీటి మీటర్లు బిగించిందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నాయకులు పి కృష్ణమూర్తి, వై కృష్ణయ్య, బి చిన్న, వై మురళి, సిహెచ్ రాము, సత్యనారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపిస్తున్న ఎస్‌పి రాధిక

తాకట్టు బంగారం రికవరీ

- ఆభరణాల మాయం కేసును ఛేధించిన పోలీసులు
- ఏడుగురు అరెస్టు, ఒకరు పరారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా గార ఎస్‌బిఐలో గత నెల 30న మాయమైన తాకట్టు బంగారం కేసును పోలీసులు ఛేధించారు. గల్లంతైన ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక కేసు వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న స్వప్నప్రియ, ఆమె సోదరుడు కిరణ్‌బాబు, బ్యాంకు క్యాషియర్ ముంజి సురేష్‌తో పాటు ఒక అపరిచిత వ్యక్తి సాయంతో నగరంలోని పొన్నాడ తిరుమలరావు నిర్వహిస్తున్న లోహితాక్షి లోన్స్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు 86 బ్యాగులతో కూడిన ఆభరణాలను ఇచ్చినట్లు గుర్తించామని తెలిపారు. తిరుమలరావు వాటిని శ్రీకాకుళం నగరంలో ఉన్న ఫెడరల్ బ్యాంకు, సిఎస్‌బి, అరసవల్లి, ఆమదాలవలసలోని సిఎస్‌బి బ్యాంకుల్లో వేర్వేరు వ్యక్తుల పేర్లతో బంగారం తాకట్టు పెట్టారని వివరించారు. లోన్, వడ్డీ కింద వచ్చిన డబ్బులను స్వప్నప్రియ చెప్పిన వ్యక్తుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. మొత్తం రూ.2.5 కోట్ల నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. ఆభరణాల మాయం విషయం బయటకు పొక్కడంతో తిరిగి 26 బ్యాగులను బ్యాంకు వారికి అప్పగించారని వివరించారు. గల్లంతైన 60 బ్యాగుల్లో ఉన్న 7.146 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.4,07,33,340 ఉంటుందని వెల్లడించారు. తిరుమలరావుకు గతంలో స్వప్నప్రియ ఇచ్చిన 24.5 గ్రాముల బంగారాన్నీ స్వాధీనం చేసుకున్నామని, వాటి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. ఆభరణాల మాయంలో తొమ్మిది మందికి భాగస్వామ్యం ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ప్రధాన నిందితురాలిగా ఉన్న స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకోగా, ఏడుగురిని అరెస్టు చేశామని, ముంజి సురేష్‌ను అదుపులోకి తీసుకోవాల్సి ఉందని తెలిపారు. ఛేధించిన బంగారాన్ని కోర్టు ద్వారా బ్యాంకుకు, తర్వాత ఖాతాదారులకు అప్పగిస్తామని చెప్పారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలి


- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలోని గాంధీనగర్ జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 10న జరగనున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె సుమన్ కోరారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఏకం చేసి ఒక సంఘంగా ఏర్పాటు చేయాలని ప్రథమ మహాసభ సందర్భంగా రాష్ట్ర కమిటీ ఎన్నిక నిర్వహించిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో కొందరిని నేటికీ ఆప్కాస్‌లో చేర్చలేదన్నారు. ఈ సమావేశంలో ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర నాయకులు వివి మురళీకృష్ణనాయుడు, బి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో 'సారీ' తగ్గని వడ్డీ రేట్లు



- రుణ గ్రహీతలకు మళ్లీ నిరాశ
- రెపో రేటు 6.5 శాతమే
- ఆర్‌బిఐ నిర్ణయం
- వృద్ధి 7 శాతంగా ఉండొచ్చు
- గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ మరోమారు రుణ గ్రహీతలను నిరాశపర్చింది. కీలక వడ్డీ రేట్లను వరుసగా ఐదో సారి యథాతథంగా నిర్ణయించింది. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన బుధవారం నుంచి మూడు రోజుల పాటు సాగిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) నిర్ణయాలను శుక్రవారం ఆయన మీడియాకు వెల్లడించారు. రెపో రేటును ఇంతక్రితం స్థాయిలోనే 6.5 శాతంగా నిర్ణయించామన్నారు. ఇందుకు ఎంపిసి సభ్యుల ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారన్నారు. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటును 6.25 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు, బ్యాంకు రేటును 6.75 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తున్నట్లు శక్తికాంత తెలిపారు. ఆర్‌బిఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య వరుసగా వడ్డీ రేట్లను పెంచింది. ఆరు సార్లలో 2.50 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో వడ్డీ, వాయిదా చెల్లింపులు ఎక్కువై రుణాలు భారం అయ్యాయి. ఈ క్రమంలోనే అనేక మంది గృహ, వాహన, వ్యక్తిగత రుణ గ్రహీతలు ఇకనైనా వడ్డీ రేట్లలో తగ్గుదల ఉండొచ్చని ఈ దఫా ఆశించిన వారికి నిరాశనే మిగిలింది.

పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడానికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని శక్తికాంత పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాధారణ స్థితికి చేరుకోవడానికి మరింత సమయం పట్టనుందన్నారు. ఓ వైపు అప్పులు పెరగడం, మరోవైపు భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కాస్త బలహీనంగా ఉందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ అంచనా వేసింది. ఆర్‌బిఐ లక్ష్యంగా పెట్టుకున్న నాలుగు శాతానికి ఇంకా చేరుకోవాల్సి ఉందని పేర్కొంది.

2023-24లో దేశ జిడిపి వృద్ధిరేటు అంచనాలను 6.5 శాతం నుంచి 7 శాతానికి ఆర్‌బిఐ పెంచింది. వర్ధమాన ఆర్థిక వ్యవస్థల కరెన్సీలతో పోలిస్తే రూపాయి విలువలో ఒడుదొడుకులు చాలా తక్కువగా ఉన్నాయని శక్తికాంత పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 1 నాటికి భారత విదేశీ మారక నిల్వలు 604 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని దాస్ తెలిపారు. డిజిటల్ రుణాల్లో మరింత పారదర్శకత తెచ్చేలా రుణ ఉత్పత్తులను అందించే వెబ్ అగ్రిగేటర్ల కోసం కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు. భవిష్యత్తు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఇటీవల వ్యక్తిగత, క్రెడిట్ కార్డు రుణాల విషయంలో రిస్క్ వెయిట్‌ను పెంచామన్నారు.

మార్కెట్లోకి రెడ్మీ 13సి 5జి



న్యూఢిల్లీ : షావోమి అనుబంధ బ్రాండ్ రెడ్మీ భారత మార్కెట్లోకి తన నూతన రెడ్మీ 13సి 5జిని విడుదల చేసింది. ఈ కొత్త స్మార్ట్‌ఫోన్‌ను మూడు వేరియంట్లలో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇందులో బేసిక్ మోడల్ 4జిబి ర్యామ్ 128జిబి మెమోరీ వేరియంట్ ధరను రూ.10,999గా నిర్ణయించింది. 8జిబి, 256జిబి మోడల్ ధరను రూ.14,499గా పేర్కొంది. వీటికి ముందస్తు ఆర్డర్లను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. డిసెంబర్ 12 తేది నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. వీటిలో 50ఎంపి ఎఐ ప్రైమరీ కెమెరా సహా 5ఎంపి సెల్ఫీ కెమెరాను అమర్చింది. 18వాట్ ఫాస్ట్ ఛార్జింగ్‌తో 5000 ఎంఎహెచ్ బ్యాటరీతో అందుబాటులోకి తెచ్చింది.



హైదరాబాద్‌లో 'గోల్డెన్ పెవిలియన్' ప్రారంభం

హైదరాబాద్ : విజయవాడ కేంద్రంగా గత 35 ఏళ్లగా వైవిధ్యమైన వంటకాలతో భోజన ప్రియులను ఆకట్టుకుంటున్న గోల్డెన్ పెవిలియన్ సంస్థ తాజాగా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో తమ శాఖను ప్రారంభించింది. ఆంధ్రా స్టైల్ బిర్యానీ, హలీమ్‌లకు మా సంస్థ ప్రసిద్ధి. బంజారాహిల్స్‌లో గోల్డెన్ పెవిలియన్‌ను గ్రాండ్‌గా ఆవిష్కరించడం వంటల వారసత్వానికి సంబంధించిన వేడుక, అసమానమైన భోజన అనుభవాలను అందించడంలో మా నిబద్ధతకు నిదర్శనం.

ఇది కేవలం రెస్టారెంట్ మాత్రమే కాదు. ఇది ఆంధ్రా వంటకాలు కాలానుగుణమైన ఆకర్షణకు నిదర్శనం." అని గోల్డెన్ పెవిలియన్ మేనేజింగ్ డైరెక్టర్ సాజిద్ మహ్మద్ పేర్కొన్నారు.ప్రస్తుతం తమకు 80 రెస్టారెంట్‌లు ఉన్నాయన్నారు.



చందా కొచ్చర్‌కు సుప్రీంలో నిరాశ

న్యూఢిల్లీ : క్విడ్‌ప్రోకో కేసులో ఇరుక్కున్న ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ చందా కొచ్చర్‌కు తాజాగా సుప్రీంకోర్టులో చుక్కెదురయ్యింది. ఇప్పటికే అనేక కేసులను ఎదుర్కొంటూ.. కోర్టుల చుట్టు తిరుగుతున్న ఆమెకు తాజాగా తన పదవీ విరమణ ప్రయోజనాలు ఇప్పించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనికి సంబంధించిన అప్పీల్‌ను స్వీకరించడానికి అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం నిరాకరించింది. ఈ ఏడాది మే నెలలో ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి పదవీ విరమణ ప్రయోజనాలను కోరుతూ ఆమె చేసిన మధ్యంతర దరఖాస్తును తిరస్కరించిన బాంబే హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది.

నిఫ్టీ @ 21వేలు

ముంబయి : ఎన్ఎస్ఇ నిఫ్టీ తొలిసారి 21 మార్కును తాకింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో వారాంతంలో సూచీలకు కొనుగోళ్ల మద్దతు లభించింది. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 304 పాయింట్లు పెరిగి 69,826 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ 68 పాయింట్లు పెరిగి 20,969కి చేరింది. ఉదయం 20,934 వద్ద ప్రారంభమైన సూచీ.. ఓ దశలో 21,006.10 వద్ద ఆల్‌టైం గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్-30లో హెచ్‌సిఎల్ టెక్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, విప్రో, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, టైటన్, కోటక్ మహీంద్రా బ్యాంక్ తదితర సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

సంపాదకీయం

'ఉప' వంచన

దళిత, గిరిజన ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన ఉప ప్రణాళిక నిధులను సకాలంలో వినియోగించకపోవడంతో అవి మురిగిపోతున్నట్లు రాజ్యసభలో సిపిఎం సభ్యులు శివదాసన్ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే పేర్కొన్నారు. తరతరాలుగా ఆర్థికంగా, సామాజికంగా వివక్షతకు, అణిచివేతకు గురైన అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం చట్టబద్ధంగా కేటాయించి ఖర్చు చేయాల్సిన నిధుల విషయంలోనూ నిర్లక్ష్యం వహించడమంటే అది ముమ్మాటికి వారిని నిలువునా వంచించడమే. గత ఐదేళ్లలో షెడ్యూల్డు తరగతుల ఉప ప్రణాళిక (ఎస్‌సి సబ్‌ప్లాన్)కు సంబంధించిన సుమారు రూ.72 వేల కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఖర్చు కాకుండానే మురిగిపోయాయి. దీంతో ఆ కేటాయింపులు రద్దు అయ్యాయి. 2022-23లోనూ రూ.13,961.54 కోట్ల ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయలేదు. గత ఐదేళ్లలోనూ ఇదే నిర్లక్ష్య ధోరణితో మొత్తం రూ.71,686.43 కోట్ల సబ్‌ప్లాన్ నిధులు మురిగిపోయాయి. 2018-19లో రూ.9,818.24 కోట్లు, 2019-20లో రూ.11,042.26 కోట్లు, 2020-21లో రూ.19,922.35 కోట్లు, 2021-22లో రూ.16,942.04 కోట్లు చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.71,686.43 కోట్లు ఖర్చు చేయకుండా మోడీ సర్కార్ మొద్దునిద్ర నటించింది. ఎన్నికల వేళ ప్రచార వేదికలపై దళిత నాయకులను ఓదార్చుతూ ఎనలేని ప్రేమ ఒలకబోసిన బిజెపి పెద్దలకు దళితులపై ఏపాటి ప్రేమ ఉందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. గిరిజనుల సబ్‌ప్లాన్ విషయంలోనూ నిధుల ఖర్చు ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. సబ్‌ప్లాన్ నిధుల తెగ్గోతలతో పాటు అణగారిన ప్రజలకు సంబంధించిన అనేక పథకాలను మోడీ సర్కార్ నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తూనేవుంది. ప్రధానంగా దళితులు అత్యధికంగా ఆధారపడిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నీరుగార్చుతోంది. ఉపాధి కార్మికులకు అందజేయాల్సిన వేతన బకాయిలను రాష్ట్రాలకు చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తూ 'ఉపాధి'కి ఉరితాళ్లు పేనుతోంది. కార్పొరేట్ల అనుకూల సవరణలతో అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడిచి ఆదివాసీల పొట్టగొడుతోంది.

బిజెపియేతర పక్షాలు అధికారంలో ఉన్న కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల ప్రభుత్వాలు దళితుల, గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యాచరణతో సామాజిక సాధికారతకు బాటలు వేస్తుంటే సహకరించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ పని చేయకపోగా అడ్డంకులు సృష్టించే కుయుక్తులకు పాల్పడుతోంది. ఉపాధి వేతన బకాయిలు చెల్లించకపోవడం అందులో భాగమే. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా సామాజిక సాధికారత పేరిట ప్రచారం దట్టిస్తోంది. కానీ రాష్ట్రంలో క్షేత్రస్థాయి పరిస్థితులు ప్రభుత్వ ప్రచారానికి భిన్నంగా ఉన్నాయని చెప్పకతప్పదు. విద్యుత్, విద్య, పురపాలక రంగాల్లో మోడీ సర్కార్ తీసుకొచ్చిన ప్రజా వినాశకర సంస్కరణలను మిగిలిన రాష్ట్రాలకంటే వేగంగా, నిరంకుశంగా అమల్జేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజనుల సంక్షేమం విషయంలో బిజెపి బాటనే అనుసరించడం సమంజసం కాదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా దళితుల సంక్షేమం కోసం మొసలి కన్నీరు కార్చకుండా వారి అభ్యున్నతికి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను మురిగిపోకుండా ఖర్చు చేయాలి. కానీ మోడీ సర్కార్‌లో ఈ దిశగా ఏమాత్రం కదలిక కానరావడం కల్ల. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మిన్నకుండిపోయి రేపోమాపో అంటూ 'ఎస్సీ వర్గీకరణ'పై ప్రజలను వంచించే నాటకాలను మించి మోడీ సర్కార్ నుంచి ఏదైనా ఆశించడమంటే అది మబ్బులు చూసి ముంతొలికిపోయడమే అవుతుంది. దేశం నలుమూలల నుంచి దళిత సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు 'పార్లమెంటు మార్చ్' సందర్భంగా 11 ప్రధాన డిమాండ్లను రాష్ట్రపతికి నివేదించారు. దళితులకు భూపంపిణీ, ఉచిత నాణ్యమైన విద్య, ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు, వెట్టిచాకిరి నిర్మూలన చట్టాన్ని పటిష్టంగా అమల్జేయడం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసుల్లో పోలీసు స్టేషన్ బెయిల్‌ను రద్దు చేయడం వంటి డిమాండ్లతో పాటు సబ్‌ప్లాన్‌కు సంబంధించి కూడా ఒక న్యాయసమ్మతమైన డిమాండ్‌ను ఈ సందర్భంగా రాష్ట్రపతికి విన్నవించారు. ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికలకు కేటాయించిన నిధులను సకాలంలో ఖర్చు చేయకపోయినా, ఆ నిధులను దారి మళ్లించినా అలాంటివారిని శిక్షించేలా చర్యలు చేపట్టాలని, అప్పుడే దళిత, గిరిజనుల అభ్యున్నతికి కాస్తంతయినా ముందుడుగు పడుతుందని విన్నవించారు. ఆ లెక్కన ఐదేళ్లలో రూ.72 వేల కోట్లు పైగా మురిగిపోయేలా చేసిన మోడీ సర్కార్ కచ్చితంగా శిక్షార్హమైనదే. అందువల్ల భావితరాల భవిష్యత్ నిర్మాణం కోసం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఓడించాలనే నినాదం సముచితం.

మహనీయుని మాట



మన లోపాలను
మనం తెలుసుకోవడం
అన్నిటికన్నా పెద్ద చదువు.
- మీర్జా గాలిబ్,
ప్రసిద్ధ కవి

ప్రత్యామ్నాయ విధానాలతోనే దీటైన ప్రతిఘటన

ఓటమి నుంచి తీసుకోవలసిన పాఠమిదే!

వ్యాఖ్య



చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో బిజెపి ఎలా గెలుపొందినదీ అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తేటతెల్లం చేశాయి. మధ్యప్రదేశ్‌లో అధికారంలోకి మళ్లీ రావడమనేది బిజెపి సాధించిన ఒక ప్రధాన విజయం. మధ్యలో 15 మాసాల పాటు కాంగ్రెస్ అధికారంలో వున్న సమయాన్ని మినహాయిస్తే దాదాపు రెండు దశాబ్దాల పాటు బిజెపి మధ్యప్రదేశ్‌ను పాలించింది. శివరాజ్ చౌహాన్ ప్రభుత్వం ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొనడమే కాకుండా కాంగ్రెస్‌కు పోలైన ఓట్ల కన్నా దాదాపు 8 శాతం ఓట్లు ఎక్కువగా (48.55 శాతం) సంపాదించుకోగలిగింది. చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలను బిజెపి గద్దె దించగలిగింది. చత్తీస్‌గఢ్‌లో గత ఎన్నికల్లో బిజెపి ఘోర పరాజయం పాలైంది. ఈసారి అక్కడ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వేసినప్పటికీ బిజెపి, కాంగ్రెస్‌ను ఓడించగలిగింది. మొత్తంగా 90 సీట్లలో 54 సీట్లను సంపాదించుకోగలిగింది. గత ఎన్నికలతో పోలిస్తే తన ఓట్ల వాటాను 13.3 శాతం పెంచుకుంది.

రాజస్థాన్‌లో, అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం గణనీయమైన సంక్షేమ పథకాలు అనేకం చేపట్టింది. చత్తీస్‌గఢ్‌లో కన్నా మెరుగైన పాలన వుందని కూడా భావించారు. అయినా, కాంగ్రెస్‌ను బిజెపి పక్కకు నెట్టగలిగింది. పోలింగ్ జరిగిన 199 సీట్లకు గానూ 115 సీట్లను సాధించగలిగింది. బిజెపి సాధించిన ఈ విజయాన్ని, కాంగ్రెస్ పరాజయాన్ని ఎలా పరిగణనలోకి తీసుకోవాలి? ఈ ఫలితాలకు రాజకీయ విశ్లేషకులు అనేక కారణాలను ఆపాదిస్తున్నారు. అయితే, అన్నింటికంటే ఒకే ఒక్క వాస్తవాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సి వుంది. బిజెపి విజయం సాధించిన ఈ మూడు రాష్ట్రాల్లోనూ హిందూత్వ ప్రభావంతో ఓటర్లు సంఘటితమయ్యారనేది స్పష్టమవుతోంది. 2019 ఎన్నికల సమయంలో కనిపించినట్లుగా పాన్-హిందూ గుర్తింపును సృష్టించడంలో బిజెపి విజయం సాధించింది. ఇది, ఉత్తర, పశ్చిమ భారతంలో ఇంతకంటే ఎక్కువగానే వుంటుంది.

ఈ వాస్తవాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనడంలో అశక్తత, పైగా ఈ హిందూత్వ సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ఎదుర్కొని, అధిగమించగల ఒక సైద్ధాంతిక వేదికను, రాజకీయ కథనాన్ని రూపొందించేందుకు కసరత్తు చేయకపోవడం కాంగ్రెస్ మౌలిక వైఫల్యంగా వుంది. ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ స్పందిస్తూ, "సైద్ధాంతిక పోరాటం కొనసాగుతుంది." అని వ్యాఖ్యానించారు. కానీ ఇదే అసలైన సమస్యగా వుంది. హిందూత్వకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎక్కడ సైద్ధాంతిక పోరాటం జరుపుతోంది?

పైగా దీనికి విరుద్ధంగా, హిందూత్వ పట్ల మెతక ధోరణి ప్రదర్శిస్తూ వచ్చారు. ఈ మృదు హిందూత్వ ధోరణిని ప్రధానంగా అమలు చేసిన నేత పిసిసి చీఫ్, మధ్యప్రదేశ్ ఎన్నికల పోరులో కాంగ్రెస్‌కు ముందుండి నడిపించిన మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్. హిందూత్వ తురుపు ముక్కను క్రమం తప్పకుండా అనుకరించడంలో, మత దురభిమానం కలిగిన బాబాలు, స్వామిజీలను పెంచి పోషించడంలో ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిని సైతం పక్కకు నెట్టివేయగల వ్యక్తి. 2019 ఆగస్టులో అయోధ్యలో రామాలయానికి పునాది వేసిన రోజున కాంగ్రెస్ కార్యాలయాలన్నింటిలో హనుమాన్ చాలీసాను పఠించాలంటూ కమల్‌నాథ్ పిలుపిచ్చారు. ఇటీవలే, బజరంగ్ సేనను కాంగ్రెస్‌తో విలీనం చేసిన కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలోనే జరిగింది. హిందూ రాష్ట్రం ఏర్పాటు అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. మధ్యప్రదేశ్‌లో హిందూత్వ సైద్ధాంతిక భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్, సమాజంలోని అన్ని రంగాలు, వర్గాల్లో ఒక పద్ధతి ప్రకారం పనిచేసింది. అక్కడ కాంగ్రెస్ అనుసరించిన వైఖరి గణనీయమైన వర్గాల్లో హిందూత్వ వాదనను మరింత బలోపేతం చేయడానికి మాత్రమే ఉపయోగపడింది.

చత్తీస్‌గఢ్‌లో కూడా, ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ తన హిందూ మత గుర్తింపును చాటింపు వేసుకుంటూ, రామ్ వన్ గమన్ పథ్‌ను నిర్మించడం వంటి ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తూ వచ్చారు. ఈ వైఖరి ఫలితంగా, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో ఆర్‌ఎస్‌ఎస్, ఇతర హిందూత్వ సంస్థలు సమాజంలోని పలు వర్గాలను మతం వైపునకు పురిగొల్పేలా చేయడానికి, మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడానికి స్వేచ్ఛ కలిగింది. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో గిరిజనులకు కేటాయించిన సీట్లలో బిజెపి ప్రధానంగా ప్రయోజనం పొందిందని ఎన్నికల ఫలితాలు తెలియ చేస్తున్నాయి. 2018 ఎన్నికల్లో, 76 ఎస్‌టి సీట్లకు గానూ కేవలం 19 సీట్లతోనే బిజెపి గెలుపొందింది. ఈసారి ఆ సంఖ్య 44కి పెరిగింది. చత్తీస్‌గఢ్‌లో 29ఎస్‌టి సీట్లకు గానూ బిజెపి 17 సీట్లను కైవసం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో 47 సీట్లకు గానూ 27 సీట్లలో విజయం సాధించింది. వన్‌వాసి కల్యాణ్ ఆశ్రమం వంటి ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలు చేపట్టిన ఆదివాసీల హిందూయీకరణ క్రమం నిరంతరంగా కొనసాగడమే గిరిజన ప్రాంతాల్లో బిజెపి లాభపడడానికి గల కారణాల్లో ఒకటిగా వుంది. పైగా, చత్తీస్‌గఢ్‌లో కొన్ని ప్రాంతాల్లో క్రైస్తవ ఆదివాసీలపై సంఘటిత దాడులు కూడా జరుగుతున్నాయి. క్రైస్తవ ఆదివాసీల హక్కులను కాపాడేందుకు బాఘెల్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. కులగణన నిర్వహిస్తామంటూ కాంగ్రెస్ చేసిన హామీ మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఒబిసిల్లో పెద్దగా ఎలాంటి ప్రభావాన్ని కలిగించలేదని పలువురు పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఒబిసి ప్రాతిపదిక రాజకీయాలు, రాజకీయ పార్టీలు పెద్దగా పెరగలేదన్న వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇది ఊహించిందే. పైగా, పోలింగ్ అనంతర సర్వేలు చూసినట్లైతే, ఒబిసిల్లో గణనీయమైన వర్గం ఇప్పటికే, పాన్ హిందూ గుర్తింపును మరింత సంఘటితపరచాలని భావిస్తున్న బిజెపితో వుంది.

హిందూ జాతీయవాద ఓటింగ్ బ్లాక్, బిజెపికి అంతర్లీన ప్రయోజనాన్ని అందించింది. ఈ బ్లాక్‌కు ఇతర ఓట్లు వచ్చే చర్యలను కలుపుకోవాల్సిన అవసరం వుంది. సంక్షేమ పథకాలు, మధ్యప్రదేశ్‌లో లాడ్లి బెహనా పథకం తరహాలో నగదు బదిలీలు, సూక్ష్మ స్థాయిలో కులాలవారీగా ఎన్నికల ప్రచారం వంటి వాటి ద్వారా లబ్ధిదారులందరినీ ఒకటి చేయడం అటువంటి చర్యల్లో ఒకటిగా వుంది. రాజస్థాన్‌లో ఎన్నికల విజయం సాధించడంలో రెండో అంశం చాలా కీలక పాత్ర పోషించింది. కులాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేసేందుకు బిజెపి అనుసరించిన ప్రక్రియ ఫలితాలను అందించింది.

అదీకాకుండా, ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎవరినీ కలుపుకోకుండా ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించడం కూడా ముందు చూపు లేకుండా చేసిన చర్యగా రుజువైంది. బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య ప్రధాన పోటీ వుండగా, మధ్యప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ వంటి పార్టీలతో, ఇంకా ఇతర చిన్న పార్టీలతో ఎన్నికల సద్దుబాట్లు చేసుకోడానికి కాంగ్రెస్ తిరస్కరించడం ఈ రాష్ట్రాల్లో బిజెపి వ్యతిరేక శక్తులను ఒక చోటకు తీసుకురాకుండా నిరోధించింది.

తెలంగాణలో కాంగ్రెస్ నిర్ణయాత్మక విజయం రెండు పదవీకాలాలు పనిచేసిన టిఆర్‌ఎస్/బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టడానికి దారి తీసింది. నిలకడలేని కె.చంద్రశేఖర రావు నాయకత్వ వ్యవహార శైలే బిఆర్‌ఎస్ ఓటమికి ప్రధాన కారణమని భావించాల్సి వుంటుంది. ఆయన ఒంటెత్తు పోకడలతో టిఆర్‌ఎస్‌ను బిఆర్‌ఎస్‌గా మార్చి తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్)కి గల విశిష్టమైన తెలంగాణ గుర్తింపును చేజేతులారా పాడుచేసుకున్నారు. పైగా ఒకపక్క బిఆర్‌ఎస్ పట్ల తెలంగాణలో అసంతృప్తి పెరుగుతుంటే మరోపక్క పార్టీకి అఖిల భారత స్వభావాన్ని ఆపాదించడం కోసం మహారాష్ట్ర, ఒడిషా, ఇతర చోట్ల తప్పటడుగులు పడ్డాయి. ఆరు మాసాల క్రితం వరకూ కూడా, బిజెపి పట్టును సాధించుకుంటే బిఆర్‌ఎస్‌కు ప్రధాన సవాలుదారుగా ఆవిర్భవిస్తుందన్నట్లు కనిపించింది.

అయితే, మే మాసంలో కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో మొత్తంగా పరిస్థితి మారిపోయింది. బిఆర్‌ఎస్ వ్యతిరేక శక్తులన్నింటినీ కాంగ్రెస్ కూడగట్ట నారంభించింది. కాంగ్రెస్ ఇంతటి ఘన విజయాన్ని అందుకునేవరకు ఆ పరిస్థితి కొనసాగింది. అయితే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశమేమంటే బిజెపి తన పరిస్థితిని గణనీయంగా మెరుగుపరుచుకుంది. 2018లో ఒక సీటు వుండగా, ఇప్పుడు 8సీట్లకు ఎగబాకగలిగింది. ఓటు వాటాను కూడా 7 శాతం నుండి 13.9శాతం వరకు పెంచుకుంది.

ఇక మిజోరాంలో మూడు దశాబ్దాల మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) పాలన ముగిసింది. కొత్తగా ఏర్పడిన జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం) విజయం సాధించింది. అసెంబ్లీలో 40సీట్లకు గానూ 27సీట్లను గెలుచుకుంది. ఎన్‌డిఎలో భాగమైన ఎంఎన్‌ఎఫ్ మాదిరిగా కాకుండా, తాము ఏ జాతీయ స్థాయి అలయన్స్‌లోనూ చేరేది లేదని జెడ్‌పిఎం ముఖ్యమంత్రి అభ్యర్థి లాల్‌దుహోమా ప్రకటించారు.

మరికొద్ది మాసాల్లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇటీవల జరిగిన ఈ మూడు హిందీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించకపోవడం ఇటీవల కాలంలో రెండుసార్లు జరిగింది. 2014, 2019 ఎన్నికల్లో ఇలాగే జరిగింది. కాంగ్రెస్, ఇతర ప్రధాన ప్రతిపక్షాలు ఈ ఓటమి నుండి సరైన గుణపాఠాలను నేర్చుకుని, ప్రత్యామ్నాయ రాజకీయ, సైద్ధాంతిక, ఆర్థిక కూటమిగా తయారయ్యేందుకు, అలాగే బిజెపి వ్యతిరేక ఓట్లను సమర్ధవంతంగా ఒక్కచోటకు చేర్చడానికి సరైన చర్యలు తీసుకోవాల్సి వుంది. అప్పుడే 2024కు అసలైన పోరాటం ఆరంభమవుతుంది.


(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

ఈ వాస్తవాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనడంలో అశక్తత, పైగా ఈ హిందూత్వ సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ఎదుర్కొని, అధిగమించగల ఒక సైద్ధాంతిక వేదికను, రాజకీయ కథనాన్ని రూపొందించేందుకు కసరత్తు చేయకపోవడం కాంగ్రెస్ మౌలిక వైఫల్యంగా వుంది. ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ స్పందిస్తూ, "సైద్ధాంతిక పోరాటం కొనసాగుతుంది." అని వ్యాఖ్యానించారు. కానీ ఇదే అసలైన సమస్యగా వుంది. హిందూత్వకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎక్కడ సైద్ధాంతిక పోరాటం జరుపుతోంది? పైగా దీనికి విరుద్ధంగా, హిందూత్వ పట్ల మెతక ధోరణి ప్రదర్శిస్తూ వచ్చారు.

అదీకాకుండా, ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎవరినీ కలుపుకోకుండా ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించడం కూడా ముందు చూపు లేకుండా చేసిన చర్యగా రుజువైంది. బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య ప్రధాన పోటీ వుండగా, మధ్యప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ వంటి పార్టీలతో, ఇంకా ఇతర చిన్న పార్టీలతో ఎన్నికల సద్దుబాట్లు చేసుకోడానికి కాంగ్రెస్ తిరస్కరించడం ఈ రాష్ట్రాల్లో బిజెపి వ్యతిరేక శక్తులను ఒక చోటకు తీసుకురాకుండా నిరోధించింది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

అవినీతిని అంతం చేయలేమా..!



డిసెంబర్ 9 'అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం'

ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల్లో అవినీతి ప్రధానమైంది. అవినీతి కనిపించని సమాజం లేదు. అవినీతి రహిత దేశం కరువు. వీటన్నిటి మధ్య నైతికత నలిగిపోతున్నది. నీతి నీరుగారి పోతున్నది. పారదర్శకత పలుచ బడుతున్నది. అక్రమార్కులు పేట్రేగి పోతున్నారు. నీతిమంతుడు చేతకాని వాడుగా పరిగణించబడుతున్నాడు. అవినీతి రహిత సమాజ స్థాపనకు పూనుకోవడం, మూలాలను అన్వేషించడం, అక్రమార్కులను శిక్షించడం, చట్టాలను రూపొందించి కఠినంగా అమలు పరచడం లాంటి పలు అంశాలను చర్చించే ఐరాస వేదికగా "అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినాన్ని" 2005 నుంచి ప్రతి ఏట డిసెంబర్ 9న పాటించటం ఆనవాయితీగా మారింది.

ఐరాస గణాంకాల ప్రకారం ప్రతి ఏట 1 ట్రిలియన్ డాలర్లు అవినీతిపరుల జేబులకు చేరుతూ, 2.6 ట్రిలియన్ డాలర్లు అక్రమ మార్గంలో దోపిడీకి గురవుతున్నాయి. ప్రపంచ జిడిపిలో 5 శాతం వరకు అవినీతిపరుల చేతులు మారుతున్నది. మానవాళి సమగ్రాభివృద్ధికి ప్రధాన అవరోధంగా నిలుస్తున్న అవినీతి అంతానికి ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, బాధ్యతగల పౌరులు, ప్రైవేట్ సంస్థలు తమ వంతు చేయూతను ఇవ్వాలి. అవినీతి పెరిగితే పేదరికం, అశాంతి, హింస, ఆర్థిక మందగమనం, నేర ప్రవృత్తి, ఆకలి చావులు, ఆర్థిక అసమానతలు రాజ్యమేలుతాయని చరిత్ర బోధిస్తున్నది. నేర చరితులే నవ నాయకులుగా అవతారమెత్తుతున్న ఉదాహరణలు మన ముందున్నాయి. అవినీతితో ప్రజాస్వామ్యం పరిహసించబడడం, ప్రభుత్వాలు అస్థిరత్వం పాలుకావడం, దేశ ప్రగతి తిరోగమన దిశగా కదలడం చూస్తున్నాం. అవినీతి, అధికార దుర్వినియోగాలు వ్యక్తి స్వేచ్ఛ, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు, మానవ హక్కులు, సామాజిక న్యాయం, ప్రభుత్వ పాలన, సమాజ భవిష్యత్తులకు విఘాతంగా మారుతున్నాయి.

ప్రపంచ దేశాల్లో అవినీతిని "కరప్షన్ పర్‌సెప్షన్ ఇండెక్స్ (సిపిఐ)" ద్వారా అంచనా వేస్తున్నారు. సిపిఐ 100 ఉన్న దేశాన్ని అవినీతిరహిత దేశంగా, 0 ఉన్న దేశాన్ని అత్యంత అవినీతి కలిగిన దేశంగా వర్గీకరిస్తారు. సిపిఐ వివరాల ప్రకారం డెన్మార్క్ (సిపిఐ 88), న్యూజిలాండ్ (88), ఫిన్‌లాండ్ (88), సింగపూర్ (85), స్వీడన్ (85), నార్వే (85), స్విస్ (84), నెదర్లాండ్స్ (82), జర్మనీ (80)లు అవినీతి అతి తక్కువగా ఉన్న దేశాలుగా తొలి 10 స్థానాలను దక్కించుకున్నాయి. అవినీతి అధికంగా ఉన్న దేశాలుగా ఇండియా (40), శ్రీలంక (37), నేపాల్ (33), పాకిస్తాన్ (28)లతో పాటు అత్యంత అవినీతి కలిగిన దేశాలుగా దక్షిణ సూడాన్ (సిపిఐ 11), సిరియా (13), సోమాలియా (13), వెనిజులా (14), నార్త్ కొరియా(16), ఆఫ్ఘనిస్తాన్ (16), లిబియా (17) దేశాలు జాబితాలో చివరన ఉన్నాయి. మొత్తం 180 ప్రపంచ దేశాల సిపిఐ జాబితాలో ఇండియాకు 85వ స్థానం లభించింది.

అవినీతి, లంచగొండితనం అధికంగా వ్యాపించిన భారత దేశంలో నీతివంతమైన సమాజం మాయమైపోయింది. దేశ ప్రగతి నిరోధకంగా అవినీతి చెదలు నిలుస్తున్నది. దేశం ఎదుర్కొంటున్న అధిక జనాభా, నిరుద్యోగం, అవిద్య, వాతావరణ కాలుష్యం, పేదరికం లాంటి సమస్యలకు అవినీతి కారణం అవుతున్నది. ప్రభుత్వ పథకాలు బడుగులకు చేరేసరికి బక్కచిక్కిపోతు న్నాయి. అవినీతి వ్యతిరేక చట్టాలు మూలన పడి మూలుగుతు న్నాయి. వార్డు మెంబర్ నుంచి కేంద్ర మంత్రి వరకు అందరికీ అవినీతి మరకలు అంటుతూనే ఉన్నాయి. చేతులు తడపందే ఫైలు కదలనంటోంది. తూకంలో మోసాలు, నకిలీ సామాన్లు, పన్ను ఎగవేతలు, కల్తీ లీలలు, ఆన్‌లైన్ మోసాలు లాంటివి సామాజిక ఆరోగ్యానికి పట్టిన తెగులుగా అవతరించాయి. నేడు నేర చరిత్రలే రాజకీయ నాయకుల అర్హతలు అయ్యాయి. భారత పార్లమెంటులో 50 శాతం వరకు యంపీలు నేరారోపణలు కలిగి ఉన్నారని, 40 మంది నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు నేరారోపణలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తున్నది. దేశవ్యాప్తంగా ఎమ్మెల్యేలు 4,442 కేసులను ఎదుర్కొంటున్నారు.

అవినీతికి వ్యతిరేకంగా ఏకమవుతూ పోరుబాట పడదాం. నైతికత, పారదర్శకత, దేశభక్తి, చట్టాల పట్ల గౌరవం, జవాబుదారీతనం, అంకిత భావం పెరగాలి. నీతివంతమైన భారత నిర్మాణానికి మనందరం పూనుకుందాం, అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనుదాం.



- డా॥ బుర్ర
మధుసూదన్ రెడ్డి
సెల్: 9949700037

అభిప్రాయం

తుపాను దెబ్బకు రైతు విలవిల

మిచౌంగ్ తుపాను ఆంధ్రప్రదేశ్‌లో బీభత్సం సృష్టించిన ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. మెట్ట ప్రాంతంలో మిర్చి, పొగాకు, శనగ, పత్తి, మాగాణిలో వరి పైర్లు నీట మునిగిపోయాయి. పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి రైతాంగం కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఎకరా సేద్యానికి వేలకు వేల రూపాయలను రైతులు పెట్టుబడిగా పెట్టారు. కౌలు రైతులు అదనంగా కౌలుకు, సాగుకు పెట్టుబడి పెట్టారు. పంట నష్టపోవడం వల్ల మరింత అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడింది. పంట పొలాలన్నీ చెరువుల్లాగా మారి వాగులుగా ప్రవహిస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు వెళ్లి....వివరాలు సేకరించాలి. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.


మిర్చి మొక్కలు కొనుగోలు నుండి మొత్తం సాగు ప్రక్రియ ముగిసేసరికి ఎకరానికి రూ.1,40,000 నుంచి 1,50,000 వరకు ఇప్పటికి ఖర్చయింది. గత ఏడాది పొగాకుకు మెరుగైన ధర లభించడంతో ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు రైతులు మొగ్గుచూపారు. పొగనారుకు డిమాండ్ ఉండడంతో మూట నారు మూడున్నర వేల నుంచి ఏడున్నర వేల రూపాయల వరకూ ధర పలికింది. ముందు నాటిన పొగాకు ఇప్పటికే పడిపోయింది. తరువాత నాటిన లేత పొలాలు నీట మునిగి పోయాయి. ఏమీ తిరిగి వచ్చే పరిస్థితి లేదు. నారుకు, దుక్కులు దున్నడానికి, అంతర్ వ్యవసాయం, ఎరువులు, పురుగు మందులు, ట్రాక్టర్, కూలీల ఖర్చు, కౌలుకు వెరసి ఎకరాకు దాదాపు రూ.40 వేలు ఖర్చ యింది. మాగాణి ప్రాంతంలో ఈదురు గాలులకు కోతకొచ్చిన పైరు నేలవాలి ంది. కంకి బురదలో కూరుకుపోయింది. కోత మిషన్ ద్వారా నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరపెట్టాల్సిన సమయంలో తుపాను మూలంగా సాధ్యం కాక గుట్టగా పోసి చాలా మంది రైతులు తాత్కాలికంగా కప్పి పెట్టారు. అయినా భారీ వర్షాల కు తడిసి పోయింది. రోడ్డు మీద ఆరబోసిన ధాన్యం నీళ్లలో కొట్టుకుపోయింది.

పత్తి సాగుకు విత్తనాల ఖర్చు విపరీతంగా పెరిగింది. బహుళ జాతి కంపెనీ మోన్శాంటో, బేయర్స్ కంపెనీలు ఇష్టమొచ్చినట్లుగా విత్తనాల ఖరీదును పెంచేశాయి. గులాబీ రంగు పురుగు వల్ల పత్తి దిగుబడులు విపరీతంగా పడిపోయాయి. వ్యవసాయ ఖర్చులు కూడా గణనీయంగా పెరిగాయి. ఏ పంట పండిస్తే గిట్టుబాటు అవుతుందో తెలియని పరిస్థితుల్లో రైతు పత్తి పండిస్తున్నాడు. ఇప్పటికే ఎకరం పత్తి సాగుకు 50 వేల రూపాయలకు పైగా ఖర్చు పెట్టాడు . ఎర్ర శనగ సాగుకు ఎకరానికి దాదాపు 35,000 నుండి 40 వేల రూపాయల వరకు, మిర్చికి రూ.1,50,000,. పొగాకుకు రూ.40,000, శనగ సాగుకు రూ. 35 వేల నుండి రూ. 40,000, పత్తికి రూ. 50,000, వరి సాగుకు 60,000 రూపాయలు కనీసంగా ఖర్చయింది. స్థానిక పరిస్థితులను బట్టి ఒక్కోచోట ఈ మొత్తాల కంటే అదనపు వ్యయం అయిన సందర్భాలూ ఉన్నాయి. అప్పుల్లో ఉన్న రైతులు పెట్టిన ఖర్చులు తిరిగి రాకపోతే ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉంది. వారిని ఆదుకునేందుకు కింది చర్యలు చేపట్టాలి.



మాగాణి ప్రాంతంలో ఈదురు గాలులకు కోతకొచ్చిన పైరు నేలవాలింది. కంకి బురదలో కూరుకుపోయింది. కోత మిషన్ ద్వారా నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టాల్సిన సమయంలో తుపాను మూలంగా సాధ్యం కాక గుట్టగా పోసి చాలా మంది రైతులు తాత్కాలికంగా కప్పి పెట్టారు. అయినా భారీ వర్షాలకు తడిసి పోయింది. రోడ్డు మీద ఆరబోసిన ధాన్యం నీళ్ళలో కొట్టుకు పోయింది.

- రైతు పెట్టిన పెట్టుబడిలో సగం అయినా ప్రభుత్వం ఇస్తే ...రైతు తిరిగి ఆ యా పైర్లు వేసుకోవడానికి అవకాశం ఉంది. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేయాలి. అందుకు ఎటువంటి నిబంధనలు పెట్టరాదు.
- రెండవ పంటకు కావాల్సిన తెల్లజొన్న , శనగ, వరి, మొక్కజొన్న, విత్తనాలను, ఎరువులు రైతులకు ఉచితంగా సరఫరా చేయాలి.
- వర్షాల వల్ల పనులు కోల్పోయిన గ్రామీణ పేదల కుటుంబాలకు రూ.10 వేల ఉచిత ఆర్థిక సహాయంతో పాటు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేయాలి
- వాతావరణ సమతుల్యత లోపించడంతో అతివృష్టి, కుండపోత వర్షాలు, తుపానులు, కరువు కాటకాలు సంభవిస్తున్నాయి. కాప్-28 సదస్సు ప్రకారం, వాతావరణం మార్పుల వల్ల దెబ్బతిన్న దేశాలకు నష్టాన్ని తట్టుకునేందుకు నిధులు అందించాలి.



- డా॥ కొల్లా రాజమోహన్,
నల్లమడ రైతు సంఘం, సెల్:9000 657799

జర్నలిస్టుల భద్రతపై ఐఎఫ్‌జె ఆందోళన

(బ్రెస్సెల్స్) : మీడియా నిపుణులు, జర్నలిస్టుల భద్రతపై జర్నలిస్టుల హక్కుల సంఘం ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జె) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జర్నలిస్టుల మృతిపై ఐఎఫ్‌జె శుక్రవారం వార్షిక నివేదికను విడుదల చేసింది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 94 మంది జర్నలిస్టులు మరణించగా, సుమారు 400 మంది జైలు పాలైనట్లు తెలిపింది.

దెబ్బతిన్న 'గుండ్లకమ్మ' గేటు

- కొట్టుకుపోయిన 2 ఎలిమెంట్లు
- భారీగా వృథా అవుతున్న నీరు


ప్రజాశక్తి - ఒంగోలు బ్యూరో

గత ఏడాది గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో నంబరు గేటు కొట్టుకుపోగా.. తాజాగా వరద ఉధృతికి మరో గేటు దెబ్బతింది. రెండవ నెంబరు గేటు కింద భాగంలో రెండు ఎలిమెంట్లు కొట్టుకుపోయాయి. దీంతో, పెద్దమొత్తంలో నీరు వృథాగా పోతోంది. ప్రస్తుతం కురిసిన వర్షానికి ప్రాజెక్టు నిండింది. రెండు టిఎంసిల నీరు పైగా నీరు రిజర్వాయర్‌లో ఉంది. ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో శుక్రవారం ఉదయం రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. వరద ఉధృతి పెరగడంతో రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో రెండో నంబర్ గేటులో రెండు ఎలిమెంట్లు కొట్టుకుపోయాయి. నీరు వృథాగా పోతోంది. కలెక్టర్ దినేష్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో రైతులు నీటి లభ్యతపై ఆందోళన చెందవద్దని తెలిపారు. వృథా పోను ప్రాజెక్టులో ఇంకా 1.5 టిఎంసిల నీరు ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మూడో నంబర్ గేటు కొట్టుకుపోయినప్పుడు ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రాజెక్టును పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపడతామని ప్రకటించారు. ఇప్పటికీ చేపట్టలేదు. గుండ్లకమ్మ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు పాదయాత్ర కూడా చేపట్టారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు.

మిజోరంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

ముఖ్యమంత్రిగా లాల్‌దుహోమా ప్రమాణ స్వీకారం

గెలిచిన మూడు రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రుల ఎంపికే పూర్తి చేయని బిజెపి



ఐజ్వాల్ : మిజోరం నూతన ముఖ్యమంత్రిగా జోరమ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం) నాయకులు లాల్‌దుహోమా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ కంభంపాటి హరిబాబు లాల్‌దుహోమా చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో 11 మంది జెడ్‌పిఎం ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) నాయకులు జోరంతంగా కూడా హాజరయ్యారు. ఎంఎన్ఎఫ్ శాసనసభా పక్షనేత లాల్ చందమా రాల్టేతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు లాల్ థన్హావ్లా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇటీవల మిజోరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 40 స్థానాలకు గాను జెడ్‌పిఎం 27 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నెల 5న జరిగిన సమావేశంలో లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా లాల్‌దుహోమాను, ఉప నాయకుడిగా కె.సప్డంగను ఎన్నుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 స్థానాలు గెలుచుకున్న జెడ్‌పిఎం తాజా ఎన్నికల్లో 27 స్థానాలు సాధించింది. ఎంఎన్ఎఫ్ 10 స్థానాల్లో విజయం సాధించింది.

ఇటీవల మిజోరంతో సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. మిజోరంలో జెడ్‌పిఎం, తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించగా, ఈ రెండు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. బిజెపి విజయం సాధించిన మిగతా మూడు రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో ఇంకా ముఖ్యమంత్రుల ఎంపికే ప్రారంభం కాలేదు.

ఇక యుపిఐతో రూ.5లక్షల వరకు చెల్లింపులు!

- ఆస్పత్రులు, విద్యా సంస్థలకు వెసులుబాటు కల్పించిన ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : యుపిఐ డిజిటల్ లావాదేవీల పరిమితిని లక్ష రూపాయల నుంచి రూ.5 లక్షలకు పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అవకాశం ఆస్పత్రులు, విద్యా సంస్థలకు చేసే చెల్లింపులకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది. మూడు రోజుల పాటు జరిగిన ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో యుపిఐ చెల్లింపుల పరిమితిని పెంచినట్లు గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. రికరింగ్ చెల్లింపుల కోసం ఇచ్చే ఇ-మ్యాండేట్ మొత్తాన్ని ప్రస్తుతం ఉన్న రూ.15 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచామని చెప్పారు. ఇప్పటి వరకు ఆటో డెబిట్ లావాదేవీ విలువ రూ.15 వేలు దాటితే 'అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథెంటికేషన్' కింద వినియోగదారులు ప్రత్యేకంగా అనుమతి ఇవ్వాలి. తాజా నిర్ణయంతో లక్ష వరకు ఎలాంటి అదనపు అథెంటికేషన్ అవసరం లేదు. ఫలితంగా క్రమం తప్పకుండా చేసే మ్యూచువల్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్, బీమా ప్రీమియం, క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపులకు ప్రత్యేకంగా అనుమతి ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. విజయనగరం జిల్లా గుర్ల మండలం గరికివలసకు చెందిన గుమ్మిడి ఆదినారాయణ ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో దిశ మహిళా పోలీసు స్టేషనులో 2023 ఫిబ్రవరిలో పోక్సో చట్టం ప్రకారం దిశ ఎస్ఐ ఎన్.పద్మావతి కేసు నమోదు చేశారు. డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు చెప్పారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను జిల్లా ఎస్పీ ఎం.దీపిక అభినందించారు.

పెండింగ్‌లో 122 హైకోర్టు కొలీజియంల ప్రతిపాదనలు

- హైకోర్టుల్లో 324 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి హైకోర్టు కొలీజియంల నుంచి 2023 డిసెంబర్ 4 వరకు స్వీకరించిన 122 ప్రతిపాదనలు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో 1,114 మంది న్యాయమూర్తులుండాల్సి ఉండగా, ప్రస్తుతం 790 మంది న్యాయమూర్తులు పని చేస్తున్నారని తెలిపారు. 324 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సుప్రీం కోర్టులో 34 మంది న్యాయమూర్తులు ఉన్నారు. అక్కడ ప్రస్తుతానికి ఖాళీలు లేవు. 122 ప్రతిపాదనల్లో 87 ప్రతిపాదనలు సలహా కోసం సుప్రీం కోర్టు కొలీజియానికి పంపామని, అందులో 45 ప్రతిపాదనలు ప్రభుత్వానికి సుప్రీం కోర్టు కొలీజియం పంపిందని తెలిపారు. సుప్రీం కోర్టు కొలీజియం వద్ద 42 ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు కొలీజియం పంపిన ప్రతిపాదనల్లో 35 ప్రాసెస్ చేస్తున్నామని, మిలిగిన 198 ఖాళీలకు సంబందదించి హైకోర్టు కొలీజియంల నుంచి ఇంకా సిఫార్సులు అందాల్సి ఉందని తెలిపారు.

అగ్ని -1 ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ : స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని -1 శిక్షణా ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు రక్షణశాఖ అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు. ఒడిశా తీరంలోని ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపం నుండి గురువారం ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు తెలిపారు. " అగ్ని 1 చాలా ఖచ్చితత్వ క్షిపణి వ్యవస్థ అని నిరూపించబడింది. వ్యూహాత్మక బలగాల కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన వినియోగదారు శిక్షణా ప్రయోగం, అన్ని కార్యాచరణ మరియు సాంకేతిక పారామితులను విజయవంతంగా ధృవీకరించింది" అని అధికారి తెలిపారు.

ధాన్యం కొనరు.. దాళ్వా సాగదు..!

- ప్రభుత్వ తీరుతో రబీ సాగుకు ఎదురుదెబ్బ
- తడిసిన ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి
- ఆరబెట్టేందుకు రోజులు తరబడి రైతుల అగచాట్లు
- దాళ్వా నారుమడులపై తీవ్ర ప్రభావం
- పలుచోట్ల వేసిన నారుమడులు జలమయం
- నెలాఖరుకు నారుమడుల పూర్తి కష్టమే



చింతలపూడి మండలంలో వర్షానికి తడిసిపోయిన ధాన్యం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ మాసూళ్లు ఎప్పటికీ పూర్తయ్యేనో.. దాళ్వా నారుమడులు పూర్తయ్యేదెప్పుడో.. ఇంకా పొలాల్లో ఉన్న 60 శాతం పంట గట్టెక్కేదెప్పుడో.. నాట్లు ఆలస్యమైతే దాళ్వా సాగు సాగేనా.. ఇలా రైతులను అనేక ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మిచౌంగ్ తుపాను దెబ్బకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు దాళ్వాసాగుపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దాళ్వా సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న జిల్లా రైతాంగం ఆశలను మిచౌంగ్ తుపాను తుడిచేసింది. ఖరీఫ్ పంట మాసూళ్లు పూర్తిచేసి దాళ్వా నారుమడులు వేసేందుకు తీవ్ర ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది. దీంతో ఇటు ఖరీఫ్ పంట పోయే.. అటు దాళ్వా పంట ఏమవుతుందో తెలియని పరిస్థితుల్లో అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో రైతులు తడిసిన ధాన్యం ఆరబెట్టడంలోనే రోజులు గడిచిపోతున్నాయి. దీంతో రబీ నారుమడులపై దృష్టి సారించే పరిస్థితి లేకుండాపోయింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో వరిసాగు సాగింది. ఏలూరు జిల్లాలో 45 శాతం మాసూళు పూర్తవ్వగా, పశ్చిమగోదావరి జిల్లాలో 35 శాతం మాసూళు మాత్రమే పూర్తయ్యాయి. సరాసరిన 40 శాతం మాసూళు పూర్తవ్వగా, దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో పంటంతా పొలాల్లోనే ఉంది. మిచౌంగ్ తుపాను భీభత్సంతో రైతుల బతుకులు అల్లకల్లోలంగా మారాయి. తుపాను ప్రభావంతో రెండు రోజులపాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో పొలాల్లో మోకాళ్ల లోతుకుపైగా వరదనీరు నిలిచిపోయింది. దీంతో మాసూలు చేసిన రాశు లన్నీ నీట మునిగాయి. కోత కోయాల్సిన పొలాలు నేలకొరిగి నీటిలో నాని కుళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. రబీలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో నిర్ణయించారు. సకాలంలో రబీ నాట్లు పూర్తి కావాలంటే డిసెంబర్ 15వ తేదీకి రబీ నారుమడులు పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పట్లో రైతులు నారుమడులు వేసే పరిస్థితి లేకుండాపోయింది. అందుకు ప్రధాన కారణం ప్రభుత్వమేనని చెప్పాలి. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులు వేగంగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేసేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం మాత్రం మాటలకే పరిమితమై రైతులను వంచిస్తోంది. పొలాల్లో నీరు తగ్గి ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేయాలంటే మరో 20 రోజులకుపైగా సమయం పట్టే పరిస్థితి ఉంది. అంటే డిసెంబర్ నెలాఖరుకు కూడా నారుమడులు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. నిడమర్రు, ఉంగుటూరు వంటి పలు మండలాల్లో కొల్లేరుకు ఆనుకుని ఉన్న పొలాలకు రైతులు నారుమడులు వేశారు. తుపాను దెబ్బకు పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో నారుమడులు పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత పరిస్థితి చూస్తే దాళ్వా నాట్లు ఫిబ్రవరి వరకూ పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. అదే జరిగితే సాగునీటి సమస్య ఏవిధంగా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఇది రబీ పంటపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీంతో ఇటు ఖరీఫ్, అటు రబీలోనూ రైతులు నష్టాలు పాలైతే అప్పుల ఊబిలో కూరుకుపోతారు. ఖరీఫ్ మాసూళ్ల త్వరగా పూర్తికావాలంటే ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలి. అయితే ప్రభుత్వం అటువైపు ఏమాత్రం ఆలోచించని పరిస్థితి.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తేనే సకాలంలో దాళ్వా సాగు

వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడా జరగడం లేదు. అందుకు సంబంధించి ఎటువంటి ఆదేశాలనూ ప్రభుత్వం విడుదల చేయలేదు. తేమ శాతానికి సొమ్ము కటింగ్ చేసే విధానమే కొనసాగుతోంది. దీంతో తడిసిన ధాన్యం రోడ్లపైనే దర్శనమిస్తోంది. కోతల మీద ఉన్న పొలాలు మాసూళ్ల త్వరగా పూర్తి కావాలంటే ధాన్యం కొనుగోలులో తేమశాతం నిబంధన సడలించి తడిసిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. అప్పుడు వేగంగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యి దాళ్వా నారుమడులు వేసేందుకు రైతులకు అవకాశం ఉంటుంది. ఇదేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే దాళ్వా సాగులోనూ రైతులకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ముగిసిన పిఎల్‌జిఎ వారోత్సవాలు

- ఎఒబిలో ముమ్మరంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు

మావోయిస్టు పార్టీ పిఎల్‌జిఎ వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 2 నుంచి 8 వరకు ఈ వారోత్సవాలకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పలు విధ్వంస ఘటనలు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్సీ వర్గాలు ముందస్తుగానే హెచ్చరించాయి. దీంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీస్ బలగాలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సరిహద్దుల్లో వచ్చే పోయే వాహన తనిఖీ చేశారు. ఆంధ్ర ఒడిస్సా పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఎఒబి జల్లెడ పట్టారు. దీంతో మావోయిస్టులు సరిహద్దుల్లో ఎటువంటి వారోత్సవాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క పోలీసుల లక్ష్యంగా మందు పాత్రలు అమర్చి ఉంటారనే కోణంలో బాంబు స్క్వాడ్ బృందాలతో ముందే తనిఖీలు చేపట్టారు. కటాఫ్ ఏరియాల్లో అదనపు బలగాలతో కుమింగ్ విస్తృతం చేశారు. మావోయిస్టు వారోత్సవాల్లో నేపథ్యంలో సరిహద్దుల్లో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని గిరిజనులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సరిహద్దులు నుంచి పోలీసు బలగాలు కుమింగ్ నుంచి వెనిదిరిగారు.



కృష్ణా జిల్లా శ్రీకాకుళంలో నీటి ముంపులో ఉన్న వరి పనలను పరిశీలిస్తున్న రామకృష్ణ, తదితరులు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - ఘంటసాల : తుపాను ప్రభావంతో రైతులు పూర్తిగా నష్టపోయినందున ఈ విపత్తును జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళంలో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... మిచౌంగ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని 26 జిల్లాలూ నష్టాలను చవిచూశాయన్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చుపెట్టిన రైతులు నట్టేట మునిగిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఒకపక్క కరువు, మరోపక్క తుపాను ప్రభావంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవి చూశారని పేర్కొన్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు రావాలని, ఎకరాకు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలు, బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారానికి వాస్తవ కౌలు రైతుల పేర్లు నమోదు

- ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిచౌంగ్ తుపాను వల్ల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా పంటనష్టం జరిగిందని, సిసిఆర్‌సి కార్డు లేకపోయినా, ఇ-క్రాపింగ్ జరగకపోయానా క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖాధికారులు వాస్తవ కౌలుసాగుదారులు, కౌలు రైతుల పేర్లు నమోదు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. అవసరమైతే నిబంధనలను మార్చి కౌలురైతులను ఆదుకోవాలన్నారు. ఎన్యుమరేషన్ సందర్భంగా కౌలు రైతులందరూ నష్టపరిహారానికి, పంటల బీమాకు తమ పేర్లు నమోదు చేయాలని అధికారులను కోరాలని, అందుకు ఒప్పుకోకపోతే ఎన్యుమరేషన్ అధికారులను నిలదీయాలని పేర్కొంది.

ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులకు జీతాల్లేవు

- 4 నెలల నుంచి ఇదే పరిస్థితి
- అప్పులతో గడుస్తున్న కుటుంబాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ)లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. ఎస్ఎస్ఎలో సుమారు 25 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లలో బోధన, బోధనేతర సిబ్బంది కలిపి సుమారు 11 వేలమంది ఉంటారు. జిల్లా, మండల విద్యాశాఖ అధికారి (ఎంఇఒ) కార్యాలయాల్లో సిఆర్‌పిఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్స్, మండల స్థాయి అకౌంటెంట్స్, మెసెంజర్స్, సహిత విద్యారిసోర్స్ పర్సన్స్, భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టులు, ఆయాలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి పార్ట్‌టైం టీచర్స్ తదితర ఉద్యోగులు సుమారు 14 వేల మంది ఉన్నారు. వేతనాలు రాకపోవడంతో ఉద్యోగులు అప్పులు చేస్తున్న పరిస్థితి నెలకొంది. కుటుంబాలు గడవటం కష్టంగా ఉందని, వేతనాలు చెల్లించాలని ఎస్ఎస్ఎ డైరెక్టరుకు ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఇటీవల వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకూ వేతనాల చెల్లింపుపై నిర్ణయం తీసుకోలేదు.

ఎంటిఎస్ అమలుపై వెనక్కి..

ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం 4, 24, 40 జిఓలు జారీ చేసింది. అయితే వీటిని అమలు చేయకుండా రద్దు చేసింది. ప్రాజెక్టులో ఉన్న ఉద్యోగులకు ఎంటిఎస్ వర్తించదని వెనక్కి తీసుకుంది. ఇచ్చిన జిఓలను ప్రభుత్వం అమలు చేయడం లేదని, కనీసం వేతనాలను సకాలంలో జమచేయడం లేదని ఎస్ఎస్ఎ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె విజయ్ ఆందోళన వ్యక్తం చేశారు.

11న చలో విజయవాడ

ఉద్యోగులను క్రమబద్ధీకరించి వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దానిని అమలు చేయకపోగా, ఇప్పుడు వేతనాలను కూడా సకాలంలో చెల్లించడం లేదు. వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో పాటు రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యలపై ఈ నెల 11న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

ఎపి ఎస్ఎస్ఎ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి అధ్యక్షులు కాంతారావు

కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో ఇగ్నో ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విద్యా రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. న్యూఢిల్లీలో జరిగిన ఓ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కెన్యా ఓపెన్ యూనివర్సిటీతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకొని సంతకాలు చేసినట్టు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు జి.ధర్మారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, కెన్యా అధ్యక్షులు విలియం సమోయి రూటోల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు, కెన్యా విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారన్నారు. ఒప్పందంలో భాగంగా ఇగ్నో - కెన్యా ఓపెన్ యూనివర్సిటీల మధ్య వివిధ అంశాలలో పరస్పర సహకారం ఉంటుందని, రెండు సంస్థల మధ్య విద్యార్థులు, అధ్యాపకులు, అత్యున్నత సాంకేతికత సహకారంతో విద్యాబోధన, కెన్యా ఓపెన్ యూనివర్సిటీ సిబ్బందికి శిక్షణ, ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సుల రూపకల్పన, ఆన్ లైన్ విద్యాబోధనలో సహకారం అందించడం, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో చేయూతనివ్వడం, విద్యా సంబంధిత వనరులు పంచుకోవడం వంటివి ఈ ఒప్పందంలో భాగమన్నారు.

వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీలో పిజి, పిహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి హార్టికల్చర్ కోర్సులోని వివిధ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశాలకు వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాలలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 50 సీట్లు, పిహెచ్‌డి కోర్సులో 21 సీట్లు భర్తీ చేసినట్లు ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ కోర్సుల్లో చేరిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నెలకు రూ.ఐదు వేలు చొప్పున, పిహెచ్‌డి విద్యార్థులకు రూ.ఏడు వేల చొప్పున స్టైఫండ్ ప్రభుత్వం నుంచి అందుతుందన్నారు.

జెఎన్‌టియు టీచింగ్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్

- 11 నుంచి నామినేషన్ల స్వీకరణ
- 16న పోలింగ్..సాయంత్రం ఫలితాల ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల బోధనా సిబ్బంది ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ ఎస్‌వి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న 4గంటలలోపు టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, ఉపాధ్యక్షులు, ట్రెజరర్ల నియామకానికి ఉత్సాహవంతులు నామినేషన్లు సమర్పించాలన్నారు. 13వతేదీ వరకూ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చన్నారు. అదేవిధంగా సెక్యూరిటీ నామినేషన్ ఈనెల 13 వరకూ దాఖలు చేసుకోవచ్చన్నారు. 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పోలింగ్ ఉంటుందన్నారు. అదేరోజు 12 గంటల నుంచి ఒంటిగంట మధ్య ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు.

మార్చి వరకూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

- నిబంధనల్లేకుండా తడిసిన ధాన్యం సేకరణ
- దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - పెదపాడు (ఏలూరు జిల్లా)

రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యాన్ని వచ్చే ఏడాది మార్చి నెల వరకూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు ఈ విషయంలో ఎలాంటి ఆందోళనా చెందొద్దని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలం కొక్కిరపాడు, వట్లూరు, రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలును, సీతారామపురంలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తూఫాన్ కారణంగా రైతులకు ఎలాంటి నష్టమూ వాటిల్లకుండా చూడటమే రాష్ట్రప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రంలోని రైతుల కోరిక మేరకు వారి వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేసేవరకూ వచ్చే ఏడాది మార్చి నెల వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరచి ఉంచుతామన్నారు. గత రబీలో అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ముందస్తుగా నవంబర్‌లో ప్రారంభించామన్నారు. వీటిని మార్చి వరకూ రైతులు కోరారని, ఇందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం లక్ష్యంగా నిర్ణయించామని, అయినప్పటికీ ఎంత మేర ధాన్యం వచ్చినా సేకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రెండు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు. నవంబరు చివరిలో తూఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ముందుగానే ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని చెప్పారు. కోత కోసిన ధాన్యాన్ని రైతుల కల్లాల నుండి నేరుగా ఆఫ్ లైన్ విధానంలో రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. వర్షాల కారణంగా పంట తడవకుండా ఉండేందుకు టార్పాలిన్‌లు అందించామన్నారు. తేమశాతంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. ఏదో రేటుకు దళారులకు తమ ధాన్యాన్ని రైతులు అమ్ముకోవద్దని, వారి వద్ద ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతుల పట్ల సానుకూలంగా ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు. కోతకు వచ్చిన పంటలో మొలకలు వచ్చిన ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి ఉందని, ఇందుకోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారితో టెస్ట్ మిల్లింగ్ చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రంగుమారిన ధాన్యం, నూకశాతంపై రైతులకు, మిల్లర్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పంట నష్టాలపై మూడు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని, పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని, కోత కోయని పంట నష్టపోయిన వారికి పంటల బీమా కింద పరిహారం అందిస్తామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని అరుణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో రూ.రెండు లక్షల 67 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. ఇంతవరకు 1. 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. గత రెండు రోజులగా తూఫాన్ వలన జిల్లాలో ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, దెందులూరు, పెదపాడు మండలాల్లో ధాన్యం అధికంగా సాగు చేస్తారన్నారు. గురువారం నాటికి 800 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాల్సి ఉండగా, వాటిని కూడా శుక్రవారం తరలించామన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరంలోని రైతు తుపాన్ మూలంగా తన ధాన్యం తడిచి 28 శాతం తేమ కారణంగా మొలకెత్తిందని, దానిని కొనుగోలు చేయాలని కోరారని, దీనిపై సిఎం జగన్ ఆదేశాల మేరకు, తడిసిన మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లర్ల ద్వారా కొనుగోలు చేసి సొమ్ము చెల్లించామని, దీనికి సంబంధిత రైతు ఆనందం వ్యక్తం చేశారన్నారు.

పట్టణాల అభివృద్ధికి త్వరలోనే అర్బన్ కమిషన్ ఏర్పాటు

- పినరయి విజయన్



తిరువనంతపురం : రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి కోసం త్వరలోనే అర్బన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వెల్లడించారు. శుక్రవారం ఎర్నాకుళం జిల్లాలోని కలూర్‌లో జరిగిన నవకేరళ సదస్సు పబ్లిక్ ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో మాట్లాడుతూ విజయన్ ఈ విషయాన్ని తెలిపారు. అంతర్జాతీయ నిపుణులతో కూడిన ఈ కమిషన్ ఏర్పాటు ప్రక్రియ పురోగతిలో ఉందని విజయన్ చెప్పారు. ఈ సందర్భంగా కొచ్చి అభివృద్ధి గురించి మాట్లాడుతూ నగరంలో నీటి ఎద్దడి సమస్యను కొచ్చి కార్పొరేషన్ సమర్థవంతంగా పరిష్కరించగలిగిందని అన్నారు. అలాగే పర్యాటక రంగంలో అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం చురుగ్గా కొనసాగిస్తోందన్నారు. వికలాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడానికి కూడా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి

- కేంద్ర మంత్రి అర్జున్ ముండాకు ఎంపి కేశినేని నాని వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
మిచువాంగ్ తుఫాను వల్ల నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి ఎంపి కేశినేని నాని కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండాకు వినతి పత్రం అందజేశారు. అర్జున్ ముండా కార్యాక్రమంలో ఎంపి వినతిపత్రం ఇస్తూ మిచువాంగ్ తుఫాను వల్ల విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలోని వేలాది ఎకరాలలో వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న, బొప్పాయి, అరటి, మామిడి వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, దీనివల్ల రైతులు ఆర్థికంగా సమస్తం కోల్పోయి ఇబ్బందులు పడుతారని తెలిపారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిస్థితి అంచనా వేసి రైతాంగాన్ని వెంటనే ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జడ్జీలు వ్యక్తిగత అభిప్రాయాలు వెల్లడించొద్దు

- సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ : న్యాయమూర్తులు బోధనలు చేయరాదని, లేదా తమ వ్యక్తిగత అభిప్రాయాలు వెల్లడించరాదని సుప్రీం కోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. టీనేజ్‌లోని బాలికలు లైంగిక వాంఛనలు నియంత్రించుకోవాలంటూ కలకత్తా హైకోర్టు తీర్పులోని వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పోస్కో కేసులో విచారణ సందర్భంగా కలకత్తా హైకోర్టు చేసిన వ్యాఖ్యలను జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన బెంచ్ తనకు తానుగా పరిగణనలోకి తీసుకుంది. ఈ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవని, అవాంఛనీయమైనవని పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలు టీనేజ్ పిల్లల గోప్యతకు, వారి పరువు, మర్యాదలకు భంగకరంగా పరిణమిస్తాయని సుప్రీం బెంచ్ పేర్కొంది. 16ఏళ్ళ వయస్సు పైబడిన టీనేజీ పిల్లలు పరస్పరం సమ్మతితో లైంగిక చర్యలో పాల్గొనడం నేరంగా పరిగణించాలని కలకత్తా హైకోర్టు పేర్కొంది. టీనేజ్ పిల్లలకు తల్లిదండ్రులు మార్గనిర్దేశనం చేయాల్సిన అవసరం వుందని, వారికి లైంగిక విద్య పట్ల అవగాహన పెంచాలని కోరింది. ప్రతి స్కూల్లోను సిలబస్‌లో భాగంగా ఈ అంశం రూపొందించాలని కోరింది.

మధ్యవర్తుల రుసుములపై మార్గదర్శకాల ప్రతిపాదన లేదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఆర్బిట్రేటర్ల ఫీజులు, మధ్యవర్తిత్వ ప్రక్రియలను నియంత్రించడానికి తదుపరి మార్గదర్శకాలను జారీ చేసే ప్రతిపాదన లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపి వివేక్ తంఖా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మధ్యవర్తిత్వ సంస్థ ద్వారా ఆర్బిట్రేషన్ ప్రక్రియ నిర్వహించబడితే, ఆర్బిట్రేటర్ల రుసుములు సంస్థ నిబంధనలను అనుసరిస్తాయని, తాత్కాలిక మధ్యవర్తిత్వాల కోసం, కేసు వారీగా మధ్యవర్తుల రుసుములను నిర్ణయించడానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అందించిందని పేర్కొన్నారు. ఇంకా, ఆర్బిట్రేషన్, రాజీ చట్టం నాలుగో షెడ్యూల్‌లోని మోడల్ ఫీజును, సెక్షన్లు 38, 31ఎ అడ్వాన్స్ డిపాజిట్లను వరుసగా ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్‌లకు సంబంధించిన ఖర్చులను వివరిస్తుందని తెలిపారు. తదుపరి మార్గదర్శకాలు అవసరం లేదని మంత్రి అన్నారు.

ఎన్నికల వ్యయంపై పిటీషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ : ఎన్నికల వ్యయంపై పరిమితులు విధించేలా మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఇవి లెజిస్లేటివ్ పాలసీకి సంబంధించిన అంశాలని పేర్కొంది. 'ఇవి శాసనపరమైన మార్పులు లేదా విధానపరమైన అంశాలు. మేం ఇలాంటి పిటిషన్‌ను ఎలా స్వీకరించగలం' అని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే వ్యయ పరిమితిని నిర్ణయించడం, నామినేషన్లకు ముందు ప్రింటైన ఆర్టికల్స్‌పై వ్యయాన్ని నియంత్రించడం, నామినేషన్లు వేస్తున్న సందర్భంగా చేసిన ర్యాలీలపై వ్యయాన్ని లెక్కించడం.. వంటి వాటిపై మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ హర్యానాకు వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు.

బిల్లులు పెండింగే ప్రధాన సమస్య

- గవర్నర్ అధికారాలు, రాష్ట్రాలతో ఘర్షణపై రాజ్యసభలో చర్చ
- గవర్నర్ మంత్రివర్గం సలహాలు పాటించడటం లేదు: సిపిఎం ఎంపి శివదాసన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగే ఈ రోజు ప్రధాన సమస్య అని కాంగ్రెస్ ఎంపి ఎల్.హనుమంతయ్య అన్నారు. శుక్రవారం రాజ్యసభలో గవర్నర్ అధికారాలు, రాష్ట్రాలతో ఘర్షణపై చర్చ జరిగింది. ఎంపి ఎల్.హనుమంతయ్య ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించాలని, తద్వారా రాష్ట్రాలు, కేంద్రం మధ్య ఘర్షణ తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య లింక్‌గా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉండే రాజ్యాంగ అధిపతి గవర్నర్ అని అన్నారు. గవర్నర్ రాజకీయ రహితుడిగా, మంత్రి మండలి సలహా మేరకు, కొన్ని విచక్షణా అధికారాలతో వ్యవహరిస్తారని, అభిప్రాయ భేదాలున్నప్పుడు గవర్నర్, రాష్ట్రం బహిరంగంగా ఎలా వ్యవహరించాలనే నిబంధనలు లేవని అన్నారు. హనుమంతయ్య కొన్ని కమిషన్‌ల నివేదికల నుండి వచ్చిన గవర్నర్‌లకు సంబంధించిన కొన్ని సిఫార్సులను సభకు వివరించారు. గవర్నర్ ఎంపికలో ప్రధానమంత్రి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌లను సంప్రదించాలని సర్కారియా కమిషన్ ప్రతిపాదించింది. ఈ ఎంపిక కోసం ప్రధానమంత్రి, స్పీకర్, హోంమంత్రి, ఉపరాష్ట్రపతి, సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రితో కూడిన కమిటీని పంచి కమిషన్ ప్రతిపాదించింది. రాష్ట్ర గవర్నర్ సలహాకు వ్యతిరేకంగా మంత్రులపై ప్రాసిక్యూషన్‌ను అనుమతించే గవర్నర్ హక్కును సమర్థించింది. రాష్ట్ర అసెంబ్లీతో గవర్నర్‌పై అభిశంసనకు కూడా అవకాశం కల్పించింది. చాలా సార్లు, ఏళ్ల తరబడి, గవర్నర్‌ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇది ఈ రోజు ప్రధాన సమస్య అని హనుమంతయ్య పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ వివరించిన రాజ్యాంగ నైతికతను పునఃపరిశీలించడానికి ఇదే సరైన సమయం అని ఆయన చెప్పారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలన్నీ ప్రతిపక్షాల పాలనలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బిజెపి ఎంపి అనిల్ అగర్వాల్ మాట్లాడుతూ రాజ్యాంగ గౌరవాన్ని కాపాడుతుందని, తన బిల్లును వెనక్కి తీసుకోవాలని సభ్యుడిని అభ్యర్థించారు.

గవర్నర్ మంత్రివర్గం సలహాలు పాటించడటం లేదు: వి.శివదాసన్, సిపిఎం

గవర్నర్ జోక్యంతో రాష్ట్ర ఆదాయానికి గండి పడుతోందని సిపిఎం ఎపి వి.శివదాసన్ పేర్కొన్నారు. మంత్రివర్గం సలహాలు పాటించడం గవర్నర్ విధి అని, కానీ గవర్నర్ పాటించటం లేదని అన్నారు. చాలా రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. అటవీ, విద్య, వ్యవసాయం రాష్ట్ర సబ్జెక్టులు, కానీ ఇప్పుడు అవి కేంద్ర ప్రభుత్వం కింద ఉన్నాయని సిపిఎం ఎంపి శివదాసన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు మరింత స్వయంప్రతిపత్తి కోసం అభ్యర్థిస్తున్నారని, అయితే కేంద్ర ప్రభుత్వం మరింత కేంద్రీకృత పాలనకు మార్గం సుగమం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తి, పంచాయతీ రాజ్ రెండింటితో సహా వికేంద్రీకరణ యుగ స్ఫూర్తి అని ఆయన చెప్పారు. అధికారాలు, పదవీకాలంతో సహా గవర్నర్ అధికారానికి సంబంధించిన ఆర్టికల్‌లను సవరించాలని రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. ఆర్టికల్ 154 , 155, 156 సవరణను ఈ బిల్లు కోరుతుంది. వైవిధ్యంపై దాడిని, రాష్ట్ర శాసనసభల అధికారాలను తగ్గించడాన్ని మనం నిరోధించాలని శివదాసన్ కోరారు. అలాగే శివదాసన్ ఇంటర్నెట్ సదుపాయం, బహిరంగ ప్రదేశాలకు ప్రాప్యత, బాల్య సంరక్షణ కోసం ప్రైవేట్ సభ్యుల బిల్లులను ప్రవేశపెట్టారు.

డా.వి.శివదాసన్ రాజ్యసభలో మూడు బిల్లులను ప్రవేశపెడుతున్నారు. దేశంలోని పౌరులందరికీ ఉచిత ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించడానికి ఉచిత ఇంటర్నెట్ హక్కు బిల్లు- 2023, పౌరులందరికీ పబ్లిక్ స్పేస్‌కి ఉచిత ప్రాప్యతను అందించే బిల్లు (ది రైట్ టు పబ్లిక్ స్పేస్ బిల్లు, 2023.), ది రైట్ టు ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ బిల్లు, 2023ను ప్రవేశపెట్టారు. ఎన్‌సిపి ఎంపి ఫౌజియా ఖాన్ వర్క్‌ప్లేస్‌లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిహారం) చట్టం-2013కు మరింత సవరణ కోరుతూ ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు.

దేశంలో 111 మంది మహిళా న్యాయమూర్తులు

- మూడు హైకోర్టుల్లో ఒక్క మహిళా న్యాయమూర్తి లేరు
- ఏడు హైకోర్టుల్లో కేవలం ఒక్కొక్కరే
- సుప్రీం కోర్టులో ముగ్గురు మాత్రమే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
దేశంలో సుప్రీం కోర్టు, 26 హైకోర్టుల్లో 790 మంది న్యాయమూర్తుల్లో కేవలం 111 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. అయితే మూడు హైకోర్టుల్లో ఒక్క మహిళా న్యాయమూర్తి కూడా లేరు. అలాగే ఏడు హైకోర్టుల్లో ఒక్కో మహిళా న్యాయమూర్తి మాత్రమే ఉన్నారు. ఈ మేరకు రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో 34 మంది న్యాయమూర్తులుండగా, అందులో కేవలం ముగ్గురే మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ హైకోర్టుల్లో ఒక్క మహిళా న్యాయమూర్తి కూడా లేరు. ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, జార?ండ్, మణిపూర్, ఒరిస్సా, పాట్నా, సిక్కిం హైకోర్టుల్లో ఒక్కరు చొప్పున మహిళ న్యాయమూర్తులు ఉన్నారు. జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తులు ఇద్దరు చొప్పున ఉన్నారు. రాజస్థాన్ (3), గౌహతి (4), ఆంధ్రప్రదేశ్ (5), కేరళ (5), అలహాబాద్ (6), కర్ణాటక (7), తెలంగాణ (7), కలకత్తా (8), గుజరాత్ (8), ఢిల్లీ (9) మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. అత్యధికంగా పంజాబ్, హర్యానా హైకోర్టులో 15 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. తరువాత మద్రాస్ హైకోర్టుల్లో 12 మంది, ముంబాయి హైకోర్టులో 11 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు.

ఎఐజెఎస్ ఏర్పాటు ప్రతిపాదనపై ఏకాభిప్రాయం లేదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఆల్ ఇండియా జ్యుడీషియల్ సర్వీస్ (ఏఐజేఎస్) ఏర్పాటు ప్రతిపాదనపై ఏకాభిప్రాయం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపిరాజీవ్ శుక్లా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2012లో రూపొందించిన ఎఐజెఎస్ కోసం సమగ్ర ప్రతిపాదన భిన్నాభిప్రాయాలను ఎదుర్కొందని, రాష్ట్ర ప్రభుత్వాలు, హైకోర్టుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు. 2013, 2015, 2022లో జరిగిన సమావేశాల్లో చర్చలు ఏకాభిప్రాయానికి దారితీయలేదని పేర్కొన్నారు. అందువల్ల, ప్రధాన వాటాదారుల మధ్య భిన్నాభిప్రాయాల దృష్ట్యా, ప్రస్తుతం ఎఐజెఎస్ ఏర్పాటు ప్రతిపాదనపై ఏకాభిప్రాయం లేదని అన్నారు.

స్టార్‌బక్స్‌కు షాక్

- ఇజ్రాయిల్ దాడులకు తీవ్ర వ్యతిరేకత
- ఈ కంపెనీ వస్తువులను బహిష్కరిస్తున్న ముస్లిం దేశాలు



న్యూయార్క్‌లో స్టార్‌బక్స్ కార్యాలయం వద్ద ఆందోళన దృశ్యం

న్యూయార్క్ : ఇజ్రాయిల్ , హమాస్ మధ్య యుద్ధం ముస్లిం దేశాల ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో స్టార్‌బక్స్ కంపెనీ ఉత్పత్తులను కొనటానికి వారు నిరాకరిస్తున్నారు. సేల్స్ తగ్గటంతో ఈ కంపెనీ పీకల్లోతు న(క)ష్టాల్లో మునిగిపోయింది. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతల కారణంగా, సీటెల్ ఆధారిత స్టార్‌బక్స్ కార్పొరేషన్ విలువ 11 బిలియన్ డాలర్లకు తగ్గింది. దీంతో కంపెనీ మొత్తం విలువలో 9.4 శాతం నష్టపోయింది. నవంబర్ 16న రేట్ కప్ డే ప్రమోషన్ తర్వాత 19 క్యాలెండర్ రోజుల వ్యవధిలో నెమ్మదిగా అమ్మకాలు, సెలవుల కారణంగా స్తబత నెలకొంది. ఇలా ప్రతిస్పందనల నివేదికల మధ్య స్టార్‌బక్స్ షేర్లు 8.96 శాతం పడిపోయాయి. దీంతో 11 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని కంపెనీ వర్గాలు తెలిపాయి.

నష్టాల బాట ఎందుకు..?

స్టార్‌బక్స్ నష్టానికి కారణం ఇజ్రాయిల్ , పాలస్తీనా మధ్య జరిగిన యుద్ధం. పాలస్తీనాకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు స్టార్‌బక్స్‌కు వెళ్లడం మానుకుంటున్నారు. స్టార్‌బక్స్ ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఒక పోస్ట్‌ను షేర్ చేసిందని, ఆ తర్వాత దానికి వ్యతిరేకంగా నిరసన కొనసాగుతోందని, ఈ నిరసన ఆగకపోతే కంపెనీకి భారీ నష్టాలు, కష్టాలు తప్పవని నిపుణులు అంటున్నారు.

కష్టమర్ల బహిష్కరణలతో అయోమయం

స్టార్‌బక్స్ కాకుండా, ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చిన కొన్ని ఇతర పెద్ద బ్రాండ్‌లూ ఉన్నాయి. నివేదిక ప్రకారం, బహిష్కరణ మధ్య ఆర్థిక సమస్యల కారణంగా ఈజిప్టులో చాలా మంది ఉద్యోగులను తొలగించారు.

ఈ పరిస్థితి మరింత దిగజారొచ్చు

స్టార్‌బక్స్ షేర్లు వరుసగా 12 స్టాక్ మార్కెట్ సెషన్‌లకు పడిపోయాయి. కంపెనీ 1992లో జాబితా చేసినప్పటి నుంచి ఇప్పుడే అత్యధికంగా నష్టపోతోంది. ఈ స్టాక్ ప్రస్తుతం ఒక్కో షేరుకు 95.80 యూఎస్‌డీ వద్ద ట్రేడవుతోంది, దీని వార్షిక గరిష్ట స్థాయి 115 యూఎస్‌డీతో వ్యాపారమవుతోంది. దీంతో సంస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఆర్థికంపై పడుతోంది. పరిస్థితి మెరుగుపడకపోతే కంపెనీ మరింత భారీ నష్టాలను చవిచూడాల్సి రావచ్చు అని ఆ సంస్థ వర్గాలు చెబుతున్నాయి.

స్టార్‌బక్స్ కార్పొరేషన్ సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయం వాషింగ్టన్‌లోని సీటెల్‌లో ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ కాఫీ , కాఫీహౌస్‌లు విస్తరించి ఉన్నాయి. 50 దేశాలలో 16,858 కంటే ఎక్కువ దుకాణాలతో, స్టార్‌బక్స్ ప్రపంచంలోనే అతిపెద్ద కాఫీహౌస్ కంపెనీ. ఇందులో ఒక్క అమెరికాలోనే 11000 కంటే ఎక్కువ దుకాణాలు ఉన్నాయి. కెనడాలో 1000 కంటే ఎక్కువ. యూకేలో 700 కంటే ఎక్కువ షాపులు ఉన్నాయి. ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య యుద్ధం వల్ల తమ కంపెనీ మునిగిపోయేలా ఉన్నదన్న ఆందోళన స్టార్‌బక్స్ యాజమాన్యంలో వ్యక్తమవుతోంది.

ఐదు గంటల పాటు - పుతిన్, రైసీ చర్చలు



మాస్కో: రష్యా అధ్యక్షులు పుతిన్, ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహీం రైసీ మధ్య శుక్రవారం చర్చలు సుమారు ఐదు గంటల పాటు సాగాయి. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతో పాటు, ఇజ్రాయిల్- హమాస్ సంక్షోభం, ఇతర అంతర్జాతీయ సమస్యలపైనా ఇరువురు నాయకులు చర్చలు జరిపారు. చర్చలు వివరాలను రష్యా అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ విలేకరులకు వెల్లడించారు. రష్యా పర్యటన కోసం ఇబ్రహీం రైసీ తన బృందంతో పాటు గురువారం మాస్కోకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల సంవత్సరాల్లో రష్యా-ఇరాన్ మధ్య బలమైన సంబంధాలు వృద్ధి చెందాయని, ఫలితంగా ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా బలోపేతం అయ్యాయని రష్యా అధ్యక్షులు తెలిపారు. ముఖ్యంగా శక్తి, విద్యలో సహకారం తీవ్రస్థాయికి చేరిందని అన్నారు. ఇరాన్ పర్యటనకు రావాల్సిందిగా పుతిన్‌ను రైసీ ఆహ్వానించారు. బుధవారం అబుదాబి, రియాద్‌లను పుతిన్ సందర్శించారు. అక్కడ యుఎఇ అధ్యక్షులు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, సౌదీ యువరాజు ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్‌లతో పుతిన్ చర్చలు జరిపారు.

2024లోనూ పోటీ చేస్తా : పుతిన్

వచ్చే ఏడాది జరగనున్న రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ప్రకటించారు. 1999 చివరి రోజున బోరిస్ ఎల్ట్సిన్ నుండి అధికార పగ్గాలు చేపట్టిన పుతిన్ ఇప్పటికే సుదీర్ఘ కాలం అధ్యక్షుడిగా పనిచేసిన రికార్డు సృష్టించారు. 18ఏళ్ళ పాటు పనిచేసిన లియోనిడ్ బ్రెజ్నెవ్‌ను అధిగమించారు. వచ్చే ఏడాది ఎన్నికల్లో పుతిన్ విజయం సాధిస్తే మరో ఆరేళ్ళపాటు ఆయనకు తిరుగులేకుండా పోతుంది. ఉక్రెయిన్‌తో జరిగిన యుద్ధంలో పోరాడిన సైనికులకు ఆయన పతకాలు బహుకరించారు. ఈ సందర్భంగా మళ్ళీ పోటీ చేస్తారా అని లెఫ్టినెంట్ కల్నల్ ప్రశ్నించగా పుతిన్ అవునని సమాధానమిచ్చారు. పుతిన్‌కు ఈ ఎన్నిక అనేది కేవలం ఒక లాంఛనప్రాయమే. ప్రభుత్వం, ప్రభుత్వ మీడియా మద్దతుతో ఆయన విజయం తథ్యం. పైగాప్రజల అసమ్మతి కూడా ఆయనకు లేదు. పుతిన్ అవినీతి నియంతృత్వంగా ప్రతిపక్షాలు విమర్శిస్తున్నప్పటికీ ఆయన మద్దతుదారులు మాత్రం ఆ విశ్లేషణను తోసిపుచ్చుతున్నారు. ఆయనకు 80శాతానికి పైగా రేటింగ్ వుందని చెప్పారు.

కీలక దశలో చైనా ఆర్థిక వ్యవస్థ రికవరీ

- అధ్యక్షుడు జిన్‌పింగ్



బీజింగ్ : చైనా ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడమనేది ఇంకా కీలక దశలోనే వుందని ఆ దేశ అధ్యక్షులు జీ జిన్‌పింగ్ తెలిపారు. కోవిడ్ అనంతర కాలంలో దేశీయ కార్యకలాపాలను మందకొడిగా సాగడం, ఆస్తుల రంగం అనేక ఒడిదుడుకులకు లోను కావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. చైనా ప్రభుత్వం పెట్టుకున్న ఐదు శాతం లక్ష్యానికి కాస్త తక్కువగా మూడో త్రైమాసికంలో చైనా ఆర్థిక వ్యవస్థ 4.9శాతం మేరకు విస్తరించింది. "ప్రస్తుతం, దేశ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ ఇంకా కీలక దశలో వుంది." అని జిన్‌పింగ్ చైనా కమ్యూనిస్టు పార్టీ సమావేశంలో పేర్కొన్నారని ప్రభుత్వ ప్రసార సంస్థ సిసిటివి పేర్కొంది. ఆర్థిక వ్యవస్థకు మరింత ప్రోత్సాహమందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితులు చాలా సంక్లిష్టంగా వున్నాయన్నారు. ఇందుకు అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక రంగాల్లో నానాటికి పెరుగుతున్న ప్రతికూల పరిస్థితులు కూడా కారణమని అన్నారు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ నిర్మాణాన్ని వేగిరపరచడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం వుందన్నారు. దేశీయ డిమాండ్‌ను విస్తరించాలన్నారు. తద్వారా రిస్క్‌లను నివారించాలని జిన్‌పింగ్ కోరారు. కీలకమైన సైన్స్, టెక్నాలజీ రంగాల్లో స్వావలంబన పెంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. తద్వారా కొత్త అభివృద్ధి లే అవుట్ నిర్మాణాన్ని వేగిరపరచాలన్నారు.



లైవ్ టెస్టింగ్ క్యాప్సుల్‌తో రాకెట్ ప్రయోగించిన ఇరాన్

టెహ్రాన్ : అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపడానికి ప్రణాళికలు రచిస్తున్న ఇరాన్ తాజాగా టెస్ట్ లివింగ్ స్పేస్ క్యాప్సుల్‌తో రాకెట్‌ను ప్రయోగించింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తస్నిమ్ ప్రకటించింది. బుధవారం గుర్తు తెలియని ప్రాంతం నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించినట్లు వెల్లడించింది. ఈ క్యాప్సూల్ 130 కిమీ ఎత్తు వరకూ చేరుకుందని తెలిపింది. రెండు కోతులను అంతరిక్షంలోకి పంపి వాటిని మళ్లీ సురక్షితంగా భూమి మీదకు తీసుకొని వచ్చిన ప్రయోగం నిర్వహించిన పదేళ్ల తరువాత ఇరాన్ మళ్లీ ఈ రాకెట్ ప్రయోగం జరిపింది.


మహువాకు మద్దతుగా పార్లమెంటు బయట నిరసన తెలుపుతున్న ఇండియా ఎంపిలు

మహువాపై బహిష్కరణ వేటు

- లోక్‌సభలో తీర్మానం ఆమోదం
- సభ్యురాలికి మాట్లాడేందుకు అవకాశమివ్వనందుకు ప్రతిపక్షాల వాకౌట్
- గాంధీ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే (క్యాష్ ఫర్ క్వయిరీ) ఆరోపణలను ఎదుర్కొంటున్న టిఎంసి ఎంపి మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు పడింది. లోక్‌సభలో బిజెపికి తగినంత మెజారిటీ ఉండడంతో ఏకపక్షంగా వ్యవహరించింది. లోక్‌సభ నైతిక విలువల కమిటీ ఇచ్చిన 500 పేజీల నివేదికను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం లోక్‌సభ ముందుంచారు. ఎథిక్స్ కమిటీ నివేదికపై అరగంట మాత్రమే చర్చకు స్పీకర్ అవకాశమిచ్చారు. అందునా ఆరోపణలు ఎదు ర్కొంటున్న ఎంపీ తన వాణిని వినిపిం చేందుకు అవకాశమివ్వాలని పదేపదే కోరా రు. ఆమెకు అవకాశమివ్వాల్సిందేనని ప్రతి పక్షాలు పట్టుబట్టాయి. అయినా స్పీకర్ తిరస్కరించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రతిపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. అనంతరం పార్లమెంటు ముఖద్వారం వద్ద నిరసన తెలిపి, అక్కడ నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపాయి. ఈ గందరగోళం మధ్య మహువాను పార్లమెంటు నుంచి బహిష్కరిస్తూ మంత్రి ప్రహ్లాద్ జోషి తీర్మానాన్ని ప్రతిపాదించడం, మూజువాణి ఓటుతో వెంటనే ఆమోదించడం, ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరిస్తున్నట్టు స్పీకరు ఓం బిర్లా ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. అదాని అక్రమాల గురించి ప్రశ్నించినందుకు మోడీ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. స్పీకరు ఓం బిర్లా మాట్లాడుతూ.. 'ఎంపి మహువా మొయిత్రా ప్రవర్తన అనైతికంగా, అసభ్యకరంగా ఉందని కమిటీ పేర్కొన్నందున ఆమె ఎంపిగా కొనసాగడం సరికాదు' అని అన్నారు. తొలుత సభలో ఎథిక్స్ కమిటీ నివేదికపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. దీంతో సభ ప్రారంభమైన నాలుగు నిమిషాలకే వాయిదా పడింది. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమైంది. అయినా, పరిస్థితిలో మార్పు లేదు. దీంతో సభ మరోసారి వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే 500 పేజీలతో కూడిన నివేదికను బిజెపి ఎంపి, ఎథిక్స్ కమిటీ ఛైర్మన్ విజయ్ సోన్కర్ ప్రవేశపెట్టారు. ఎథిక్స్ కమిటీ నివేదిక ప్రతులను తమకు ఇవ్వాలని, ఓటింగ్‌కు ముందు చర్చ జరపాలని మొయిత్రాకు తన వాదన వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని ప్రతిపక్ష ఎంపిలు కోరారు. దీనికి స్పీకరు ఓం బిర్లా తిరస్కరించారు. 2005లో స్పీకరు సోమనాథ్ ఛటర్జీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ఉటంకించారు. డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే ఆరోపణలను ఎదుర్కొన్న 10 మంది ఎంపీలను సభలో మాట్లాడేందుకు సోమ్‌నాథ్ ఛటర్జీ అనుమతి ఇవ్వలేదని అన్నారు. నాటి స్పీకర్లు పాటించిన సంప్రదాయాన్నే తాను అనుసరిస్తున్నట్లు ఓం బిర్లా తన చర్యను సమర్థించుకునే యత్నం చేశారు. చర్చ సందర్భంగా వివిధ పార్టీల నేతలు మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు వేయడాన్ని తప్పుపట్టారు.

ఇది మీ పతనానికి నాంది : మొయిత్రా

లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడంపై మహువా మొయిత్రా పార్లమెంటు వెలుపల నిప్పులు చెరిగారు. సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వనందున, సభలో చెప్పాల్సినదంతా పార్లమెంటు ఆవరణలో మీడియాకు మొయిత్రా వివరించారు. తనను బహిష్కరించే హక్కు ఎథిక్స్ కమిటీకి లేదని అన్నారు. ఇది మీ (బిజెపి) ముగింపునకు ఆరంభం అంటూ ఘాటుగా విమర్శించారు. 'దుర్గా మాత వచ్చింది. ఇక చూసుకుందాం. వస్త్రాపహరణను వాళ్లు మొదలుపెట్టారు. ఇక మహాభారత యుద్ధాన్ని చూస్తారు' అంటూ బిజెపి సర్కార్‌పై ఆమె ఘాటుగా విమర్శలు చేశారు. 'నాకు 49 సంవత్సరాలు, నేను వచ్చే 30 ఏళ్లు పార్లమెంటు లోపల, వెలుపల మీతో పోరాడతాను' అని అన్నారు. 'నన్ను బహిష్కరించడం వల్ల అదానీ గురించి ఎవరూ నోరెత్తకుండా చేయొచ్చని అనుకుంటోంది. కంగారూ కోర్టు దానికి అవసరమైన భూమికను ఏర్పాటు చేసింది. యావత్ దేశం మీరు (మోడీ) ఉపయోగించిన విధివిధానాల దుర్వినియోగం మీకు అదానీ ఎంత ముఖ్యమో చూపిస్తుంది. 'మీరు మహిళా ఎంపిని వేధించడానికి ఎంతకైనా తెగిస్తారు ' అని మొయిత్రా మండిపడ్డారు. 'ఈ కేసులో ఎటువంటి ఆధారాలు లేకుండా ఎథిక్స్ కమిటీ నన్ను బహిష్కరించాలని నిర్ణయించింది. ఎక్కడా నగదు, లేదా బహుమతులకు సంబంధించిన ఆధారాలు లేవు. పార్లమెంటరీ లాగిన్ షేరింగ్‌ను నియంత్రించడానికి ఎలాంటి నియమాలు లేవు' అని ఆమె అన్నారు. ఎథిక్స్ కమిటీ ప్రతి నిబంధనను ఉల్లంఘించిందని, తమను అణగదొక్కేందుకు ఈ కమిటీని ఓ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం ఇద్దరు వ్యక్తులు చెప్పిన మాటలను నమ్మి తనను దోషిగా నిర్ధారించారని తృణమూల్ ఎంపి పేర్కొన్నారు. 'రేపు మా ఇంటికి సిబిఐని పంపించి నన్ను వేధించినా ఆశ్చర్యపోనక్కర్లేదని' అన్నారు. మహువా మొయిత్రాకు న్యాయం నిరాకరించబడిందని టిఎంసి లోక్‌సభ నేత సుదీప్ బందోపాధ్యాయ అన్నారు. 'ఇది కక్షపూరిత చర్య' అని కాంగ్రెస్ ఎంపి అధిర్ రంజన్ చౌదరి అన్నారు. బిఎస్‌పి ఎంపి డానిష్ అలీ కూడా మహువా మొయిత్రాకు మద్దతు పలికారు.కాంగ్రెస్ ఎంపి కార్తీ చిదంబరం మాట్లాడుతూ.. 'కమిటీ ఆమె నేరస్తురాలని నిర్ధారణకు వచ్చింది. అయితే తరువాత వరుసలో కేంద్ర ప్రభుత్వం ఒక నిర్దిష్ట కాలపరిమితిలో ఒక తీవ్రమైన చట్టపరమైన సంస్థాగత విచారణకు కమిటీ సిఫార్సు చేసింది. ఎవరైనా నేరస్తుడిని నిర్ధారించిన తరువాత విచారణ ఎందుకు? కమిటీ విచారణ ఎందుకు అడుగుతుంది? అని ప్రశ్నించారు.

వడ్డీ రేటు ఎక్కువగా ఉంటే నిధులను ప్రభుత్వ ట్రెజరీలోనే ఉంచండి

- పిఎస్‌యులకు కేరళ ఆర్థిక శాఖ ఆదేశం

తిరువనంతపురం : బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ రేటు ఇస్తుంటే ప్రభుత్వ ట్రెజరీలోనే నిధులను ఉంచాలని పబ్లిక్ సెక్టార్ యూనిట్లు (పిఎస్‌యు), ఇతర ప్రభుత్వ సంస్థలను కేరళ ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ మేరకు ఈ నెల 1న ప్రిన్సిపల్ సెక్రటరీ (ఫైనాన్స్) రవీంద్ర కుమార్ అగర్వాల్ సర్క్యులర్ జారీ చేశారు. 'బ్యాంకులు, ఇతర అవకాశాల కంటే ఎక్కువ వడ్డీ ఇస్తుంటే అన్ని పిఎస్‌యులు, స్వయంప్రతిపత్త సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యం లేదా ప్రభుత్వ ప్రాయోజిత సంస్థలు తమ నిధులు, లాభాలను రాష్ట్ర ట్రెజరీలోనే ఉంచాలి' అని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ ట్రెజరీ కంటే తక్కువ వడ్డీ రేటు ఇస్తున్నా అనేక పిఎస్‌యులు, ఇతర సంస్థలు తమ నిధులను బ్యాంకుల వద్ద భారీగా డిపాజిట్ చేయడాన్ని ప్రభుత్వం గమనించిందని అన్నారు. పిఎస్‌యులకు తమ సొంత డిపాజిట్ల నుంచి గరిష్ట ప్రయోజనం పొందే హక్కు ఉందని అంగీకరిస్తున్నామని, అయితే అది ప్రజల సొమ్ము కాబట్టి అటువంటి పెట్టుబడి నుంచి గరిష్ట రాబడి పొందాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. 2018 ఆగస్టులో పిఎస్‌యులకు ఇతర సంస్థలకు తమ నిధులను ట్రెజరీలో లేదా తమకు నచ్చిన షెడ్యూల్డ్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసుకునే అవకాశాన్ని కేరళ ఆర్థిక శాఖ కల్పించింది.

109 మంది మాత్రమే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఆరేళ్లలో హైకోర్టు న్యాయమూర్తులుగా కేవలం 109 మంది మాత్రమే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు చెందిన వారు నియామకం అయ్యారు. అదే జనరల్ కేటగిరి (ఒసి)కి చెందిన వారు 505 మంది హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం అయ్యారు. ఈ మేరకు రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018 నుంచి 2023 డిసెంబర్ 2 వరకు ఆరేళ్లలో మొత్తం 650 మంది హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం కాగా, అందులో జనరల్ కేటగిరి 492, ఎస్‌సి 23, ఎస్‌టి 10, ఒబిసి 76, మైనార్టీ 36 మంది న్యాయమూర్తులు నియామకం అయ్యారు.





మీకోసం


బంగాళాదుంప ముక్కలను కట్ చేసి మజ్జిగనీళ్లల్లో ఐదు నిమిషాల పాటు ఉంచి తర్వాత ఫ్రై చేస్తే త్వరగా వేగిపోతాయి. ముక్కలు కూడా మెత్తగా ఉంటాయి.

జీవన సౌరభం

నాయకత్వమంటే దారి పొడవునా ముందుండి నడవడం కాదు, బాట వెయ్యడం. తోవ చూపడం..

JEEVANA జీవన the family

చిన్న కాకి



ఒక పెద్ద మర్రిచెట్టు మీద కాకులన్నీ తమ గూళ్లను నిర్మించుకుని పిల్లలతో హాయిగా జీవిస్తున్నాయి. ఇంతలో వేరే ప్రాంతం నుంచి ఒక చిన్న కాకి ఆ చెట్టు పైకి నివాసం ఏర్పరచుకోవాలని వచ్చింది. ఇది గమనించిన మిగిలిన కాకులు ఇక్కడ గూడు కట్టుకోవడానికి వీలు లేదంటూ వాదించడం మొదపెట్టాయి. ఎవరెన్ని చెప్పినా నువ్వు ఇక్కడ ఉండరాదు అంటూ ఏకతాటిపై నిలబడ్డాయి.

చేసేదిలేక ఆ చిన్నకాకి పక్కనున్న చెట్టు తొర్రలో చిన్న ఉడుత పిల్లతో నేస్తంగా జీవించడం మొదలు పెట్టింది. ఉడుత తెచ్చిన ఆహారం కాకి, కాకి తెచ్చిన తిండి ఉడుత పంచుకొంటూ ప్రశాంతంగా జీవిస్తున్నాయి.

కొన్ని రోజుల తరువాత మర్రిచెట్టు దగ్గర అన్ని కాకులూ ఏదో ఆందోళనగా అరుస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాయి. ఏమైందో కనుక్కుందామని అక్కడికి వెళ్ళిన చిన్నకాకికి ఎవ్వరూ సమాధానం చెప్పకుండా విసుక్కుని పంపించేశారు.

అప్పుడు అటుగా వస్తున్న ఉడుత 'పాపం ఒక కాకి పిల్ల ప్రాకుతూ వెళ్ళి చిన్న బొరియలోకి దూరేసిందంట, అందులో నుండి రాలేక అరుస్తూ వుంది. ఎవ్వరూ ఆ బొరియలోకి వెళ్ళలేక ఇబ్బంది పడుతున్నారు' అని జరిగిన విషయం చెప్పింది.

చిన్న కాకి వెంటనే బొరియ దగ్గరికి వెళ్లి తన చిన్న శరీరం ఇందుకు ఉపయోగపడుతున్నదని చెప్పి, అందులోకి వెళ్ళి కాకి పిల్లను బయటకు తీసుకువచ్చింది. దాని సాహసానికి, సహాయానికి కాకులన్నీ సంతోషించాయి. తమ తప్పు తెలుసుకున్న మిగిలిన కాకులు ఆ చిన్న కాకిని తమతోపాటు ఉండమని, ఒక మంచి గూడును కూడా నిర్మించి ఇచ్చాయి. స్నేహం మరువని చిన్న కాకి ఉడుతకు కూడా మంచి గూడు కట్టించి తనతో పాటు ఉండమన్నది. ఆకారం బట్టి, ఎవరినీ అంచనా వేయకూడదని భావించి అప్పటి నుంచి కాకులన్నీ చక్కగా కలసి మెలసి జీవించ సాగాయి.

- సింగంపల్లి శేష సాయి కుమార్,
86396 35907.



నీడను కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని జంతువులు ఉన్నాయి కదా! పక్కనే వాటి నీడలు గజిబిజిగా ఇచ్చాం. ఏ నీడ, ఏ జంతువుదో కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



ఎస్. ఇర్ఫాన్,
3వ తరగతి,
జెడ్‌పి బాలుర హైస్కూలు,
మైదుకూరు,
కడప జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పుస్తక పఠనంతోనే మార్పు సాధ్యం

'సమాజంలో ప్రతి ఒక్కరూ లింగం, లైంగికత అర్థాలను తెలుసుకోవాలి. స్త్రీ, పురుషులతో సమానంగా 'క్వీర్' కమ్యూనిటీ వాళ్లకు కూడా గౌరవ మర్యాదలు ఇవ్వాలి. అలా జరగాలంటే పుస్తక పఠనం ఒక్కటే మార్గం' అని నమ్మిన రీతూపర్ణ, అసోంకు చెందిన ట్రాన్స్ కమ్యూనిటీ సభ్యురాలు. ఉన్నత విద్యావంతురాలైన రీతూ, 'అకం' ఫౌండేషన్ స్థాపించి, గ్రామాల్లో ఉచిత గ్రంథాలయాలను నిర్వహిస్తున్నారు. సామాజిక కార్యకర్తగా రాష్ట్రవ్యాప్తంగా క్వీర్ సభ్యుల హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు. సమాజాన్ని చైతన్యం చేయడంలో ఎంతో ప్రతిభావంత పాత్ర పోషిస్తున్న రీతూ, ప్రస్తుతం అసోం ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, నేషనల్ కౌన్సిల్‌కి ట్రాన్స్ జెండర్ సభ్యుల ప్రతినిధిగా నామినేట్ అయ్యారు.

అసోం జోర్హాట్‌లో పుట్టి పెరిగిన రీతూకి, తన లైంగికత వల్ల ఇంటి నుండి ఏవిధమైన అభ్యంతరం రాలేదు. తనో ప్రత్యేక వ్యక్తినని ఎప్పుడూ భావించలేదు. చాలా ఏళ్లు అలాగే గడిచిపోయింది. హైస్కూల్‌కి వచ్చే నాటికి అవమానాలు చుట్టుముట్టాయి. స్నేహితులంతా ఏడిపించేవారు. వాళ్ల నుండి కాపాడుకోవడానికి తనను తాను ఇంట్లోనే బంధించుకునేది. బయటికి వెళ్లాలంటే ఎంతో భయపడేది. ఆ సమయంలోనే తనకు గొప్ప సాంత్వన ఇచ్చాయి పుస్తకాలు. అవే ఆమె స్నేహితులయ్యాయి. తన బాధను అర్థం చేసుకున్న పుస్తకాలపై ఆ క్షణం నుండి ప్రేమ పెంచుకుంది. క్రమంగా భయం పోయి స్కూలుకు వెళ్లేది. అవమానాలు ఎదురైన ప్రతిసారీ స్కూలు గ్రంథాలయమే ఆమెని అక్కున చేర్చుకునేది. ఆ చిన్ననాటి రోజుల్లోనే తనలాంటి పిల్లల కోసం ఏదైనా చేయాలన్న ఆలోచన రీతూలో బలంగా నాటుకుపోయింది.

ప్రస్తుతం అసోంలో 'క్వీర్' కమ్యూనిటీ కార్యకర్తగా కీలకపాత్ర పోషిస్తున్న రీతూ విద్య ద్వారానే తన కమ్యూనిటీపై ఉన్న అపోహలను పారద్రోలుతున్నారు. 'నన్ను వేధించినందుకు నా క్లాస్‌మేట్‌లను ఎప్పుడూ నేను నిందించలేదు. తమకంటే భిన్నంగా ఉన్న పిల్లలను తోటి వారు అర్థం చేసుకోలేరు. అందుకే బెదిరింపులకు పాల్పడుతారు. ఆ వివక్ష పోవాలంటే విద్య కంటే మెరుగైన మార్గం మరొకటి లేదం'టారు రీతూ.

'పుస్తకాలు మాట్లాడుతాయి..'

2017లో గౌహతిలో డిగ్రీ పూర్తి చేసిన రీతూ సొంత గ్రామానికి తిరిగివచ్చారు. 'సమాజాన్ని చైతన్యం చేయాలంటే ముందు నా గ్రామాన్ని చైతన్యం చేయాలని భావించాను. గ్రామాల్లో కూడా క్వీర్ సభ్యుల పట్ల అవగాహన ఉండాలి. వారి హక్కులు తెలియాలి. అందుకే గ్రామంలో ప్రతి పిల్లవాడికి క్వీర్ సభ్యుల గురించి తెలియజేయాలనుకున్నాను. 'అకం' ఫౌండేషన్ స్థాపించి, 'కితాపే కత్తా కోయ్' పేరుతో (తెలుగులో.. పుస్తకాలు మాట్లాడుతాయి) గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేశాను. నేను సేకరించిన వందల పుస్తకాలు అందులో ఉంచాను. మా గ్రామం చుట్టుపక్కల నుండి కూడా పిల్లలు వచ్చేవారు. టీ తోటల్లో పనులు చేసే వాళ్లు కూడా పుస్తకాలు చదివేవారు. ప్రారంభించిన కొత్తల్లోనే వందమంది వచ్చారు. గ్రంథాలయంలో ఉన్న అస్సామీ, హిందీ, ఇంగ్లీషు పుస్తకాలను చదివేందుకు ఇప్పటికీ ప్రతి రోజూ 30 మంది పిల్లలు వస్తున్నారు.




ఏమేం పుస్తకాలంటే ...

లింగం, లైంగికత, మానసిక ఆరోగ్యం, వాతావరణ సామర్థ్యం, మైనార్టీ హక్కులు వంటి వివిధ లోతైన అంశాలతో కూడిన పుస్తకాలు మా గ్రంథాలయంలో ఉంచాను. ఇవన్నీ స్థానిక భాషల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాను. అప్పుడే వాళ్లకి విషయాలపై సమగ్ర సమచారం వస్తుంది. తద్వారా జ్ఞానం పెరుగుతుంది' అంటూ తన గ్రంథాలయం గురించి చెబుతున్న రీతూ చాలా స్వల్ప కాలంలోనే అసోం, దిబ్రుగఢ్‌లో 'చంద్రప్రభ సైకియానీ' పేరుతో మరో గ్రంథాలయాన్ని, రీసోర్స్ కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో వీలైనంత ఎక్కువమంది పిల్లలు, ప్రజలను చేరుకోవడమే నా లక్ష్యం' అంటున్న రీతూ కోవిడ్ సమయంలో కూడా తన ప్రయాణాన్ని ఆపలేదు. ఆన్‌లైన్ వేదికగా స్టోరీ టెల్లింగ్ ప్రాజెక్టును ప్రారంభించారు. కళాశాలలు, యూనివర్శిటీ క్యాంపస్‌లు, పబ్లిక్ పార్కులు మొదలైన ప్రాంతాలలో ఇప్పటికీ పాప్-అప్-లైబ్రరీలను నిర్వహిస్తుంటారు. వివిధ వేదికలపై క్వీర్ హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు.



ఒకపక్క గ్రంథాలయాల నిర్వహణ, మరోపక్క తన క్వీర్ కమ్యూనిటీ సభ్యుల హక్కుల కోసం 2021లో నెలకొల్పబడిన 'దృష్టి క్వీర్ కలెక్టివ్' తరపున రాష్ట్రమంతా విస్తృత ప్రయాణాలు చేస్తారు రీతూ. లింగం ఆధారంగా వివక్షకు గురైన రీతూ లాంటి ఎంతోమంది వ్యక్తులు ఉన్నత విద్యనభ్యసించారు. ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారు. సమాజసేవలో ముందున్నారు. అయితే పుస్తక పఠన శక్తి ద్వారా తన వారి బతుకులను బాగు చేసుకోవాలన్న రీతూ లక్ష్యం మాత్రం వారందరికీ భిన్నం.. ఆమె ఎంచుకున్న ఈ మార్గం అభినందనీయం.

మజ్జిగతో ఆరోగ్యానికి మేలు



మజ్జిగ మన ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా దోహదపడుతుంది. మజ్జిగ తాగితే చలువ చేస్తుంది. అందుకనే గ్రామాల్లో ఇప్పటికీ మజ్జిగను చల్ల అని పిలుస్తారు. అనారోగ్యంతో ఉన్నప్పుడు ఎక్కువగా మందులు వాడే సమయంలో సహజంగా వేడి చేస్తుంది. దాని నుంచి తప్పించుకోవటానికి ఎక్కువ మజ్జిగను వాడొచ్చు. నీళ్ల విరోచనాలు, రక్త విరోచనాలు, జిగట విరోచనాలు అవుతున్న సమయంలో మజ్జిగ వాడటం చాలా అవసరం. జిగట విరోచనాలు (అమీబియాసిస్) చాలా ప్రమాదకరమైనవి. ఇవి నిదానంగా వ్యాపించి మనిషిని రక్తహీనతకు గురిచేస్తాయి. క్రమేపి నీరసం వస్తుంది. ఇలాంటి అమీబియాసిస్ తగ్గాలంటే లీటర్ల కొద్దీ మజ్జిగ తాగాలి. అది కూడా వెన్న లేని పల్చని నీళ్ల మజ్జిగ వాడితే మంచిది. మజ్జిగలో అల్లం, కరివేపాకు వేసుకుంటే మరీ మంచిది. ఒకప్పుడు గ్రామీణులు రాత్రిపూట అన్నంలో పాలుపోసి ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి తోడుపెట్టి ఉదయాన్నే దాన్ని అల్పాహారంగా తీసుకునేవాళ్లు.



భిన్నమైన భావోద్వేగాలతో ఎన్టీఆర్ 31


కథానాయకుడు ఎన్టీఆర్ నటించనున్న 31వ సినిమా ఇప్పటికే ఖరారైంది. దీనికి ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించనుండగా, మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఇది వచ్చే ఏడాది ద్వితీయార్థంలో పట్టాలెక్కనుంది. ఈ విషయాన్ని ప్రశాంత్ నీల్ ధ్రువీకరిస్తూ చిత్ర కథాంశంపైనా తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పష్టత ఇచ్చారు. 'దీన్ని అందరూ ఓ యాక్షన్ సినిమాలా భావిస్తారని నాకు తెలుసు. కానీ, నేను నా జానర్‌లోకి వెళ్లాలనుకోవట్లేదు. నిజానికిది భిన్నమైన భావోద్వేగాలతో కూడిన వైవిధ్యభరిత చిత్రంగా ఉంటుంది. ఇది నాకు చాలా కొత్త కథ అని చెప్పగలను' అని ప్రశాంత్ వెల్లడించారు.

యశ్ కొత్త సినిమా 'టాక్సిక్'



కన్నడ నటుడు నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. తన కొత్త సినిమా గురించిన పురోగతి వివరాలను 'నువ్వు వెతుకుతున్నది... నిన్ను కోరుకుంటోంది' అనే క్యాప్షన్‌తో పోస్టుచేసిన ఓ వీడియో ద్వారా తెలియజేశారు. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించనున్న టాక్సిక్ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లుగా పేర్కొన్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా సాయి పల్లవిని ఎంపిక చేసినట్లుగా సమాచారం.

పాత్ర నిడివి కన్నా ప్రభావం ముఖ్యం



బాబీ డియోల్

"యానిమల్ సినిమా చూసిన వారంతా నేను ఇంకా ఎక్కువ సమయం కనిపిస్తే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు. నటుడిగా ఇది నాకు ప్రశంసతో సమానం. కానీ, సినిమాలో మన పాత్ర నిడివి కంటే దాని ప్రభావం ఎంత అనేది ముఖ్యం." అని నటుడు బాబీ డియోల్ వ్యాఖ్యానించారు. తన పాత్ర నిడివిపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ట్వీట్లపై ఆయన పై విధంగా స్పందించారు. సందీప్ వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటించిన 'యానిమల్' సినిమాలో నటుడు బాబీ దేవోల్ విలన్‌గా ఆకట్టుకున్నారు. "సందీప్ వంగాకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పాలి. ఈ సినిమాతో ఆయన నా జీవితాన్ని మార్చేశారు. నాకు పాత్ర గురించి చెప్పి 15 రోజుల షూటింగ్ మాత్రమే ఉంటుందని చెప్పారు. నిడివి తక్కువైనా కథాపరంగా ప్రాధాన్యమున్న పాత్ర అది. ఎంతో సవాలుగా అనిపించింది. ఈ స్థాయిలో విజయాన్ని మాత్రం ఊహించలేదు. నటనకు ఆస్కారమున్న పాత్ర దొరికినందుకు చాలా ఆనందంగా ఉంది.' బాబీ పేర్కొన్నారు.

సవితకే మళ్లీ పగ్గాలు

ఐదు దేశాల హాకీ టోర్నీకి జట్టును ప్రకటించిన హాకీ ఇండియా



బెంగళూరు: స్పెయిన్ వేదికగా 15నుంచి జరగనున్న ఐదు దేశాల టోర్నమెంట్‌లో పాల్గొనే భారత మహిళల జట్టును హాకీ ఇండియా(హెచ్‌ఐ) శుక్రవారం ప్రకటించింది. గోల్ కీపర్ సవిత పునియకు మరో దఫా కెప్టెన్‌గా ఎంపికయ్యింది. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే 22మంది ఆటగాళ్ల జాబితాను హెచ్‌ఐ శుక్రవారం వెల్లడించింది. 'బలమైన జట్టుతో ఐదు దేశాల టోర్నీలో పాల్గొనేందుకు వెళ్తున్నామని, మిగిలిన నాలుగుజట్లు బలమైన జట్లు కావడంతో ఆ టోర్నమెంట్‌లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహిళల హాకీ చీఫ్ కోచ్ జన్నెకె షాప్‌మాన్ తెలిపారు. ఈ టోర్నమెంట్ ప్రదర్శన ఆధారంగా భారత్‌లో జరిగే క్వాలిఫయర్ టోర్నమెంట్‌లో ఆటగాళ్లను ఎంపిక చేయడం జరుగుతుందని, యూరోపియన్ టాప్‌క్లాస్ జట్లతో తలపడే భారతజట్టు ప్రదర్శనను ఎంతో దోహదపడుతుందని ఆమె తెలిపారు. టోర్నీలో భారత్‌తోపాటు ఆతిథ్య స్పెయిన్, ఐర్లాండ్, జర్మనీ, బెల్జియం జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఈ టోర్నమెంట్ స్పెయిన్‌లోని వెలెన్సియా వేదికగా డిసెంబర్ 15-22మధ్య జరగనుంది. ఈ టోర్నమెంట్ ముగిసిన అనంతరం రాంచీ వేదికగా జనవరి 13నుంచి ఒలింపిక్ క్వాలిఫయర్ మ్యాచ్‌లు జరగనున్నాయి.


జట్టు..

గోల్‌కీపర్లు: సవిత(కెప్టెన్), బిఛ్చూ దేవి ఖరిబమ్
డిఫెండర్లు: నిక్కి ప్రధాన్, ఉదిత, ఇషికా చౌదరి, గుర్జీత్ కౌర్, అక్షత అబోసో
మిడ్‌ఫీల్డర్లు: నిషా, వైష్ణవి, మోనిక, సలీమా తెతె, నేహా, నవనీత్ కౌర్, సోనిక, బల్జీత్ కౌర్
ఫార్వర్డ్స్: జ్యోతి ఛత్రి, సంగీత కుమారి, దీపిక, వందన కటారియా(వైస్ కెప్టెన్), బ్యూటీ దుంగ్‌దంగ్, షర్మిలా దేవి

నరేంద్ర మోడీ స్టేడియం యావరేజ్

- రేటింగ్ ప్రకటించిన ఐసిసి

దుబాయ్: వన్డే ప్రపంచకప్ ఫైనల్ జరిగిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంకు ఐసిసి రేటింగ్ ప్రకటించింది. ఐసిసి ప్రతినిధులు మరోసారి నరేంద్ర మోడీ స్టేడియం పిచ్‌ను పరిశీలించి రేటింగ్‌ను ఇచ్చారు. వరల్డ్ కప్ ఫైనల్ జరిగిన పిచ్ 'యావరేజ్'గా ఉందంటూ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తన నివేదికలో పేర్కొన్నారు. అంతేకాదు, వరల్డ్ కప్‌లో భారత్ ఆడిన 11మ్యాచ్‌ల్లో 5 మ్యాచ్‌లు ఇలాంటి 'యావరేజ్' పిచ్‌లపైనే జరిగాయని, ఆ ప్రకటనలో పేర్కొంది. వరల్డ్ కప్‌లో టీమిండియా-పాకిస్తాన్ మ్యాచ్ కోసం ఉపయోగించిన పిచ్‌నే ఫైనల్‌కు సిద్ధం చేశారంటూ ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ కూడా ఆరోపించాడు. తొలుత ఈ మ్యాచ్ కోసం ఉపయోగించిన పిచ్ నాసిరకంగా ఉందంటూ విమర్శలు వచ్చాయి. టోర్నీలో ప్రతి మ్యాచ్‌లోనూ సునాయాసంగా నెగ్గిన టీమిండియా... ఫైనల్లో ఆసీస్ చేతిలో చిత్తుగా ఓడింది. అందుకు పిచ్ అని, మరో వేదికలో ఫైనల్ మ్యాచ్ జరిగి ఉంటే భారత్ తప్పక గెలిచేదంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో తాజాగా ఐసిసి ప్రతినిధులు గుజరాత్ పిచ్‌ను సందర్శించి రిపోర్ట్ ఇచ్చారు.



'ఫైటర్' టీజర్ విడుదల

హృతిక్ రోషన్ హీరోగా దీపికా పదుకొనే, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో తెరకెక్కుతోన్న 'స్పిరిట్ ఆఫ్ ఫైటర్' చిత్రం నుండి తాజాగా టీజర్ విడుదలైంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతోంది. వయాకామ్ 18 స్టూడియోస్-మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్త నిర్మాణంలో వస్తున్న ఈ సినిమా 2024 జనవరి 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

మలయాళ నటి లక్ష్మికా మృతి



మలయాళ నటి లక్ష్మీకా సజీవన్ (24) మృతి చెందారు. ప్రస్తుతం యూఏఈలో ఉన్న ఆమె గుండెపోటుతో చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటిస్తున్నారు. అజు అజీష్ దర్శకత్వం వహించిన 'కాక్క' షార్ట్ ఫిల్మ్‌లో పంచమిగా నటించిన లక్ష్మికా, తన కెరీర్‌లో పంచవర్ణతతా, సౌదీ వెల్లక్కా, పూజయమ్మ, ఉయారే, ఒరు కుట్టనాదన్ బ్లాగ్, నిత్యహరిత నాయగన్, దుల్కర్ సల్మాన్ నటించిన ఒరు యమందన్ ప్రేమకథా చిత్రాల్లో నటించారు.



ప్రపంచాన్ని మార్చేవి అవే..

'ఒక పుస్తకం, ఒక పెన్, ఒక స్టూడెంట్, ఒక టీచర్ మాత్రమే ఈ ప్రపంచాన్ని మార్చగలరు' అంటూ సమంత తన ఇన్‌స్టాలో పోస్టు చేశారు. ప్రస్తుతం సినిమాల నుంచి బ్రేక్ తీసుకున్న సమంత విదేశాల్లో మయోసైటిస్ వ్యాధికి చికిత్స తీసుకుని ఇటీవల భారత్‌కి తిరిగివచ్చారు. హైదరాబాద్‌లోని ఓ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలలో తాజాగా పాల్గొన్నారు. స్కూల్ పిల్లలతో సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోస్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ పైవిధంగా పోస్టు చేశారు.

43బంతుల్లో 193పరుగులు
టి10లీగ్‌లో సలీమ్ విధ్వంసం



దుబాయ్: టి10 లీగ్‌లో ఓ సంచలనం నమోదైంది. యూరోపియన్ క్రికెట్ టి10 లీగ్‌లో స్పెయిన్ ఆటగాడు హంజా సలీమ్ ధార్ కేవలం 43బంతుల్లోనే 193పరుగులు చేసి రికార్డు నెలకొల్పాడు. అందులో 22సిక్సర్లు, 14 బౌండరీలున్నాయి. కాటలున్యా జాగ్వార్-సోహల్ హాస్పిటాల్టెట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హంజా ఈ రికార్డు సాధించాడు. హంజా చేసిన 193 పరుగుల్లో సిక్సర్ల ద్వారా 132 పరుగులు రాగా ఫోర్ల ద్వారా 56 (మొత్తంగా 188) పరుగులు వచ్చాయి. అంటే అతడు సింగిల్స్, డబుల్స్ ద్వారా చేసినవి 9 పరుగులు మాత్రమే. దీంతో తొలి బ్యాటింగ్ దిగిన జాగ్వార్.. నిర్ణీత 10 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 257 పరుగులు చేసింది. హంజాతో పాటు మరో ఓపెనర్ యాసిర్ అలీ 19 బంతుల్లోనే 58 పరుగులు చేశాడు. టి10 క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు. ఛేదనలో హాస్పిటాల్టెట్ 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. దీంతో జాగ్వార్.. 153 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనవచ్చు! అయితే షరతులు వర్తిస్తాయి..

- రష్యా, బెలారస్ అథ్లెట్లకు ఐఓసి సూచన
- వ్యక్తిగత ఈవెంట్ల వరకు ఓకే..
- టీమ్ ఈవెంట్లపై నిషేధంలో మార్పు లేదు: ఐఓసి



పారిస్: రష్యా, బెలారస్ అథ్లెట్లకు స్వల్ప ఊరట లభించింది. ఈ రెండు దేశాలకు చెందిన వ్యక్తిగత క్రీడలకు సంబంధించిన అథ్లెట్లకు మినహాయింపునిచ్చిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసి) టీమ్ ఈవెంట్స్‌కు సంబంధించి ప్రాతినిధ్యం వహించే క్రీడలపై ఎప్పటిలానే నిషేధం కొనసాగించింది. ఈ మేరకు ఐఓసి శుక్రవారం తన వెబ్‌సైట్‌లో... ఈ రెండు దేశాలకు చెందిన అథ్లెట్లు వ్యక్తిగత క్రీడాంశానికి సంబంధించిన వారిపై నిషేధం ఎత్తివేస్తున్నట్లు తెలిపింది. ఒలింపిక్స్‌కు అర్హతసాధించిన వారు పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండాలని అప్పుడే వారికి ఆ దేశాల తరపున ఆడేందుకు అనుమతిస్తామని పేర్కొంది. అయితే వీరు తటస్థ జెండాతో పాల్గొనాల్సి వుంటుందని తెలిపింది. ఈ నిబంధన అథ్లెట్లతోపాటు కోచ్, సహాయక సిబ్బందికీ వర్తిస్తుందని తెలిపింది. అలాగే ఈ రెండు దేశాలకు చెందిన అథ్లెట్లు ఒలింపిక్స్‌లో ప్రవేశార్హతకు సంబంధించిన అన్ని ప్రమాణాలు కలిగి ఉండాలని తెలిపింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి రష్యా, బెలారస్‌లను కారణంగా చూపుతూ పశ్చిమ దేశాలు ఈ రెండు దేశాల క్రీడాకారులపై రకరకాల ఆంక్షలు విధించాయి. ఐఓసిని ఇవి ఒక పావుగా వాడుకుంటున్నాయి. ఇక పారిస్ ఒలింపిక్స్‌కు ఇప్పటివరకు 4,600మంది అథ్లెట్లు అర్హత సాధించగా.. అందులో 11మంది తటస్థ అథ్లెట్లు ఉన్నారు. వీరిలో 8మంది రష్యన్లు, ముగ్గురు బెలారస్‌కు చెందిన వారన్నారు. ఈ మార్గనిర్దేశకాలు తమను అవమానిస్తున్నట్లుగా భావించాల్సి వస్తుందని, క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభివర్ణించారు.

ఐఓసి నిషేధంతో..

ఈ రెండు దేశాలపై ఐఓసి నిషేధంతో అథ్లెట్లు సాధించిన పతకాలను ఆ దేశాలకు చెందినవిగా పరిగణించరు. అలాగే పతకాలు సాధించినప్పుడు, క్రీడల ప్రారంభంలోనూ జాతీయ గీతాలను ఆలపించేందుకు అనర్హులు. ఈ రెండు దేశాల ప్రభుత్వ అధికారులను క్రీడలకు ఆహ్వానించడంగానీ, ఏ ఒక్క క్రీడలోనూ వీరు ప్రాతినిధ్యం వహించేందుకు, అధికార లాంఛనాలతో పాల్గొనేందుకు అవకాశం లేదు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68